## స్వర్ణముఖికి వరద నీరు



శ్రీకాళహస్తి, అక్టోబర్ 16 ప్రభాతవార్త
'హమ్మయ్యా! స్వర్ణముఖి నదికి నీరొస్తుంది.' స్వర్ణముఖి నదికి జీవనది అని ఉత్తరవాహిని అనే పేర్లున్నాయి. చంద్రగిరి నియోజక వర్గంలో పుట్టే స్వర్ణముఖి నది తిరుపతి సమీపం నుంచి శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని రేణిగుంట, ఏర్పేడు, శ్రీకాళహస్తి మండలం నుంచి నాయుడుపేట మీదుగా బంగాళాఖాతంలో కలుస్తుంది. శ్రీకాళహస్తి కి దక్షిణ కాశీ అనే పేరు వచ్చిందంటే స్వర్ణముఖి నది ఆలయానికి పడమర ఉత్తరంగా ప్రవహిస్తుంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షంతో బుధవారం సాయంత్రానికి శ్రీకాళహస్తి వద్ద స్వర్ణముఖి నదికి వరద నీరు ప్రవహిస్తుంది. దాంతో జనం హర్షం ప్రకటిస్తున్నారు.


# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త






## కపిలతీర్థం మంత్రముగ్ధం



భారీ వర్షాలతో తిరుమలకొండల్లోంచి ఔషధమూలికలతో కలసి వరదనీరు మాల్వాడిగుండం మీదుగా కపిలతీర్థం జలాశయానికి చేరుతోంది. కొండల్లోంచి వరదనీరు భారీగా పరబళ్ళు తొక్కుతూ ఉధృతిగా వస్తుండటంతో కపిలతీర్థంలో భక్తులను స్నానాలకు అనుమతించడంలేదు. కొండల్లోంచి దుముకుతున్న నీటి అందాలను భక్తులు, యాత్రికులు ఆసక్తిగా తిలకిస్తున్నారు. ప్రభాతవార్త-తిరుపతి

# ఎడతెరపిలేని వాన



చిట్టత్తూరు సమీపంలోని పొంగి పొర్లుతున్న కాళంగివాగు

**-కాళంగి, కారాకొల్లు వాగుల్లో నీటి ప్రవాహం**
**-పలు గ్రామాలకు రాకపోకలు బంద్**
**-తహశీల్దార్, వీఆర్ఓలు, సిబ్బంది విస్తృత పర్యటన**
**-పునరాసకేంద్రాలకు తరలింపు-భోజన సౌకర్యాలు**

తొట్టంబేడు, అక్టోబర్ 16 ప్రభాతవార్త
గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి తొట్టంబేడు మండలంలోని వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. లోతట్టు ప్రాంతాల్లో సహా పలుదళిత, గిరిజనవాడలు నీటితో నిండిపోయాయి. ఎక్కడ చూసినా రోడ్లపై నీటిప్రవాహం కనపడుతూ పంటపొలాలు చెరువులను తలపిస్తున్నాయి. అక్టోబర్ నెల సాధారణ వర్షపాతం తొట్టంబేడు మండలంలో 236.3 మి.మీ ఉండగా బుధవారం సాయంత్రం 5గంటల వరకు61.6మి.మీ వర్షపాతం నమోదైంది. రెండు రోజుల పాటు కురిసిన వర్షాలకు గ్రామాల్లో ప్రజల జన జీవనం అస్తవ్యస్తంగా మారింది. ఓవైపు లోతట్టు ప్రాంతాల్లో ఇండ్లు నీటిలో మునిగిపోవడంతో పాటు రోడ్లన్నీ చెరువులను తలపిస్తున్నాయి. ఇక మండలంలోని చిట్టత్తూరు పంచాయతీ కొత్తకండ్రిగ గ్రామంలో రోడ్డుపైనే నీటిప్రవాహం రావడంతో లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ఇండ్లలోకి నీరు చేరడంతో వారు బిక్కుబిక్కుమంటూ ఉన్నారు. ఇక బోనుపల్లికి వెళ్లే మార్గంలో ఉన్న ఏరు పొంగి ప్రవహించడంతో బోనుపల్లి, కంచనపల్లి, అంజూరు, శ్రీకృష్ణాపురం గ్రామాలకు



కారాకొల్లు వాగు వద్ద ఉధృతిని పరిశీలిస్తున్న అధికారులు దృశ్యం

మానికి వెళ్ళే సమీపంలో ఉన్న వాగు పొంగడంతో దొంగల ముదూరు, కారాకొల్లు గ్రామాలకు రాకపోకలు లేవు. ఇక చిట్టత్తూరు నుంచి రామలింగాపురంకు వెళ్లే మార్గం వర్షపునీటితో కొట్టుకుపోవడంతో ఈమార్గంలో కూడా రాకపోకలు లేవు. రాత్రి వరకు నీటి ప్రవాహం ఉన్నా వాగుదాటేందుకు ఎవ్వరు ప్రయత్నించలేదు. ఇక మండలంలోని చిట్టత్తూరు పంచాయతీ గణపతి ఎస్టీ కాలనీ వాసులకు, పొయ్య పంచాయతీ రామానాయుడు ఎస్టీకాలనీలో నివాసం ఉంటున్న వారికి తహశీల్దార్ మధుసూధనరావు, సీనియర్ అసిస్టెంట్ నారాయణ, ఎస్ఐ ఈశ్వయ్య, వీఆర్ఓలు విస్తృతంగా వర్షాన్ని సైతం లెక్కచేయకుండా గ్రామాలు, దళితవాడల్లో పర్యటించి వారికి భోజన సదుపాయాలు కల్పించారు. ఇక బసవయ్యపాళెం కాలువ పూడిపోవడంతో వెంటనే స్పందించిన తహశీల్దార్ జెసిబితో తొలగించి నీరువెళ్ళేందుకు చర్యలుతీసుకున్నారు. రోడ్లు బురదమయంగా మారడంతో గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికే చెరువులు 50శాతం నీటితో నిండాయని అధికారులు తెలిపారు. ఇక ప్రతి గ్రామంలో వైద్యసిబ్బంది ఇంటింటికి జ్వరాలు, జలుబు, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా మాత్రలను పంపిణీచేస్తున్నారు. ఏది ఏమైనా ఆర్డీవో భాను ప్రకాష్‌రెడ్డి ఆదేశాలతో తొట్టంబేడు తహశీల్దార్ మధుసూధనరావు, సీనియర్ అసిస్టెంట్ నారాయణస్వామి, వీఆర్ఓలు పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తు ప్రజల మనన్నలు అందుకున్నారు. నేడు కూడా పాఠశాలలు, కళాశాలలకు సెలువు ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వరన్ ఓ ప్రకటనలో తెలిపారు.

## జారిన బండరాళ్ళు

**-కొండదారిలో జెసిబిలతో ఆగమేఘాలపై తొలగింపు**
**-శ్రీవారిపాదాలు, ఆకాశగంగమార్గంలో భక్తులకు అనుమతి నో**





తిరుమల, అక్టోబర్ 16ప్రభాతవార్తప్రతినిధి:
అల్పపీడనం ప్రభావంతో మూడురోజులుగా కురుస్తున్న జోరువానకు బుధవారం ఉదయం తిరుమల రెండో ఘాట్‌రోడ్డులో బండరాళ్ళు జారిపడ్డాయి, భారీ వర్షాలకు శేషాచలంఅటవీప్రాంతంలో వరదనీరు ప్రవాహానికి కొండపైనుండి మట్టికొట్టుకువచ్చి బండరాళ్ళు ఘాట్‌రోడ్డుపై విరిగిపడ్డాయి. రాకపోకలకు అంతరాయం కలిగింది. కొండచరియలు విరిగిపడటంతో ప్రత్యేక బృందాలుగా ఉన్న టిటిడి ఇంజనీరింగ్ విభాగం, అటవీశాఖ, విజిలెన్స్ సిబ్బంది జెసిబిల సాయంతో ముద్దప్రాతిపదికన బండరాళ్ళను, మట్టిని తొలగించారు. భారీ వర్షాలకు వరదనీరు రోడ్డపైకి రావడంతో కొండపై శ్రీవారిపాదాలు, ఆకాశగంగ, జపాలి, పాపవినాశనంవెళ్ళే భక్తులను బుధవారం మధ్యాహ్నం నుండి అనుమతించడంలేదు. తిరుమలకొండల్లోంచి వస్తున్న వరదనీరు తిరుపతిలోని పలుకాలనీల్లోని ఇళ్ళలోకి చేరుతోంది. మొదటి ఘాట్‌లో ఉన్న మాల్వాడిగుండం ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ నీరు తిరుపతిలోని కపిలతీర్థంలోకి చేరుతుండటంతో భక్తులను స్నానాలకు ఆపివేశారు. అల్పపీడనం ప్రభావం తిరుపతి జిల్లాపై తీవ్రంగా చూపింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తుఫాన్‌గా మారి బలమైన వర్షాలు కురుస్తుండటంతో తిరుమల, తిరుపతి, రేణిగుంట, శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు, గూడూరు, నాయుడుపేట, చంద్రగిరి, తలకోనప్రాంతాల్లో వరదనీటికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. శ్రీవారిమెట్టుమార్గంలో వరదనీరు ఉధృతంగా చేరడంతో నడకదారిని, మెట్టుమార్గాన్ని మూసివేశారు. భక్తుల రాకపోకలను గురువారం రాత్రి వరకు పూర్తిగా నిలిపివేశారు. భారీ వర్షాలతో తిరుపతి జిల్లాలో ఇప్పటికే పూర్తిస్థాయిలో రక్షణచర్యలకు ఉపక్రమించారు. లోతట్టుప్రాంతవాసులను పునరావాసకేంద్రాలకుసురక్షితంగా తరలిస్తున్నారు. కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటుచేసి తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, టిటిడి ఈఓ శ్యామలరావు, అదనపు ఈఓ చిరుమామిళ్ళవెంకయ్యచౌదరి స్వయంగా పర్యవేక్షిస్తూ వరదలతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకునేలా ఆదేశించారు. జిల్లా అంతటా రెవెన్యూ, పోలీసు యంత్రాంగం అప్రత్తమై ప్రజల రక్షణకు సిద్ధమైంది.

## లోతట్టు ప్రాంతాలు జలమయం

**ఇళ్ళలోకి వచ్చిన వర్షపునీరు..న ల్యాండ్ కాకుండా చెన్నై వెళ్లిన ఇండిగో విమానం**
**న మామండూరు వద్ద చెట్టు కూలి స్తంభించిన ట్రాఫిక్**





రామకృష్ణాపురం వద్ద కాజ్‌వేపై నుంచి ప్రవహిస్తున్న వరదనీరు, మల్లెమడుగు డ్యాం

రేణిగుంట, అక్టోబరు 16 ప్రభాతవార్త: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఎడ తెరపి లేకుండా కురుస్తున్న వర్షాలవల్ల రేణిగుంట మండలంలో జన జీవనం అతలాకుతలం అయింది. లోతట్టు ప్రాంతాలన్నీ పూర్తిగా జలమయ్యాయి. 13వ తేదీ నుంచి 16 తేదీ మధ్యాహ్నం వరకు 198.2 మి.మీ వర్షపాతం నమోదైంది. ఉదయం విమానాశ్రయం వద్ద జోరు వాన కురుస్తుండడంతో ఇండిగో విమానం ల్యాండ్ కాకుండా దారి మళ్లించి చెన్నైకి పంపారు. వర్షం కాస్త తగ్గుముఖం పట్టడంతో చెన్నై నుంచి అదే విమానం రేణిగుంటలో ల్యాండ్ అయింది. విమానాలకు ఎలాంటి అంతరాయం ఏర్పడకుండా విమానాశ్రయ అధికారులు కట్టుదిట్టమని చర్యలు చేపట్టారు. భగత్‌సింగ్ కాలనీ, ఏఎన్ఆర్ కాలనీ, రజక కాలనీల్లో వరద నీరు ఇళ్ళలోకి వచ్చింది. జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, స్థానిక ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ఆదేశాల మేరకు డిప్యూటీ తహసీల్దార్ శ్యాంప్రసాద్, ఎంపీడీవో విష్ణు చిరంజీవి, సర్పంచ్ నాగేషం, కార్యదర్శి మణి తమ సిబ్బందితో టీడీపీ పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషాతో సంఘటనా స్థలం చేరుకుని సహాయక చర్యలు చేపట్టడంతో వరదనీటికి అడ్డుకట్టపడింది. వరద నీరు ప్రవాహాన్ని దారి మళ్లించారు. రామకృష్ణాపురం కాజ్‌వేపై వరద నీరు రోడ్డుపై ప్రవహిస్తుంది. కాజ్‌వేల వద్ద వరద ప్రవాహం అధికంగా ఉంటే ఆ మార్గంలో ప్రయాణించవద్దని ప్రమాదవస్థాయిని మించి వరద నీరు వస్తే బ్రిడ్జిలకు అటువైపు ఇటువైపు ముళ్ళ కంచెలు అడ్డం వేయడానికి అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. మామండూరు వద్ద జాతీయ రహదారిపై పెద్ద చెట్టు కూలి పడడంతో ట్రాఫిక్‌కు స్తంభించింది. తక్షణం స్పదించిన అర్బన్ సీఐ చంద్ర, ఎస్ఐ అరుణ్‌కుమార్‌రెడ్డి తమ సిబ్బందితో వెళ్లి జేసీబీ ద్వారా చెట్టును పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షిస్తున్నారు. బాధితులను పునరావస కేంద్రాలకు తరలించే ఏర్పాట్లు చేస్తున్నారు. విప్పమానుపట్టెడ పంచాయతీలో సర్పంచ్ లక్ష్మీపతిరెడ్డి పంచాయతీ కార్యాలయంలో అధికారులు, వార్డు మెంబర్లతో సమావేశం నిర్వహించి పునరావస కేంద్రానికి ఏర్పాట్లను ఈవోపీఆర్‌డీ ప్రభు సమక్షంలో చేపట్టారు. మల్లెమడుగు డ్యాంలోకి 800 క్యూ సెక్కుల వరదనీరు వస్తుందని ఇరిగేషన్(మల్లెమడుగు) డీఈఈ చంద్రమౌళి తెలిపారు. డ్యాం సామర్థ్యం 1.81 టీఎంసీలను తెలిపారు. ఇన్‌ఫ్లో ఇలాగే 800 గురువారం ఉదయానికే డ్యాం నిండుతుందన్నారు. వరదనీరు ఇన్‌ఫ్లో బట్టి ఇరిగేషన్ అధికారుల సూచనల మేరకు గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదలచేస్తామని డిప్యూటీ తహసీల్దార్ శ్యామ్ తెలియజేశారు. డ్యాం నిండిన వెంటనే గేట్లు ఎత్తకముందే సైపన్ల ద్వారా డ్యాంలో చేరిన అధిక నీరు దిగువకు విడుదలవుతుందని ఆయన అన్నారు. కాబట్టి డ్యాం దిగువ ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

## భారీ వర్షాలతో శ్రీవారిమెట్టు గేటు మూసివేత




చంద్రగిరి, అక్టోబర్ 16 ప్రభాతవార్త:
అల్పపీడనం కారణంగా ఎడతెరిపిలేని భారీ వర్షాలతో శ్రీవారిమెట్టు మార్గాన్ని టిటిడి అధికారులు మూసివేశారు. టిటిడి ఈఓ శ్యామలరావు ఆదేశాలతో మంగళవారం రాత్రి నుండి కురుస్తున్న వర్షాలతో శ్రీవారిమెట్టు మార్గంలో (గత అనుభవాల) వరదలు, కొండ చరియలు విరిగిపడే ప్రమాదాల దృష్ట్యా టిటిడి అధికారులు ముందస్తు చర్యల్లో భాగంగా బుధవారం భక్తులను దర్శనానికి నిలిపివేశారు. అలిపిరి, శ్రీవారిమెట్టు మార్గాలపై ప్రత్యేక నిఘా పెట్టారు.

## ఉభయ జిల్లాలకు "రెడ్ అలర్ట్"!

**-అధికారయంత్రాంగం అప్రమత్తం**

ప్రభాతవార్త-తిరుపతి:
బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో తిరుపతి, చిత్తూరుజిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఇప్పటికే గత మూడురోజుల ఎడతెరపిలేని వర్షాలతో జనజీవనం అతలాకుతలమైంది. ఉభయజిల్లాల్లో ప్రజలు ఇళ్ళకే పరిమితమైపోయారు. అల్పపీడనం బలంగా మారి తీరం దాటే సూచనలు ఉన్నాయని వాతావరణశాఖ హెచ్చరించిన నేపథ్యంలో తిరుపతి జిల్లాలో కొన్ని మండలాలు, చిత్తూరుజిల్లాలోని కొన్ని మండలాలు రెడ్ అలర్టు జోన్‌లో చేరాయి. గురువారం కూడా ఈ జిల్లాల్లో అన్ని ప్రభుత్వ విద్యాసంస్థలు, ప్రైవేటు పాఠశాలలు., ఎయిడెడ్, అన్ని జూనియర్ కళాశాలలు, అంగన్‌వాడీకేంద్రాలకు సెలవుప్రకటించారు. ఆకస్మిక వరదలు వచ్చే అవకాశం ఉందని హెచ్చరికలతో జిల్లా యంత్రాంగం కూడా అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. ఎన్‌డిఆర్‌ఎఫ్ బలగాలు కూడా జిల్లాకు చేరాయి. తిరుపతి జిల్లాలో సగటుగా 40మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లావ్యాప్తంగా 208 పునరావాస కేంద్రాలు ఏర్పాటుచేసి, 1,183మందిని తరలించారు. గత మూడురోజులుగా కురుస్తున్న ఎడతెరపిలేని వానలతో జనజీవనం పూర్తిగా స్తంభించిపోయింది. కూలీలు, పేదవర్గాలు ప్రజలు తాగునీరు, ఆహారం సమస్య ఎదుర్కొంటున్నారు. నాగలాపురం, వరదయ్యపాళెం, గూడూరు, తడ, సూళ్ళూరుపేట, తిరుపతి, చంద్రగిరి, తిరుపతి రూరల్ ప్రాంతాల్లో చలి తీవ్రతకు జనం వణుకుతున్నారు. తిరుపతి నుండి వెళ్ళే పలు రైళ్ళు రద్దయ్యాయి. తిరుపతిజిల్లాలో అత్యధికంగా తడలో 278.9మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది. వరదయ్యపాళెంలలో 229.2మిల్లీమీటర్లు, తిరుపతి అర్బన్‌లో 172.4, రూరల్‌లో 182.4, చంద్రగిరి 142.4, రేణిగుంట 200మిల్లీమీటర్లు, శ్రీకాళహస్తి 236.3, దొరవారిసత్రం 248.2, పుత్తూరు 188.6, రామచంద్రాపురం 151.మిల్లీమీటర్లు, సత్యవేడు 174.4మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది. గూడూరులో 190.2మిల్లీమీటర్లు వర్షపాతం నమోదు కావడంతో ఆయా ప్రాంతాల్లోని లోతట్టుప్రజలను అప్రమత్తం చేశారు. జిల్లావ్యాప్తంగా సగటున 201మిల్లీమీటర్లు వర్షపాతం నమోదుతో అల్పపీడనం ప్రభావం మరింతగా చూపనుంది.

### నేడు పాఠశాలలకు సెలవు

**- కలెక్టర్ సుమిత్‌కుమార్**

చిత్తూరు, అక్టోబర్ 16 ప్రభాతవార్త:
బంగాళాఖాతంలో ఏర్పడి అల్పపీడన ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తుండటంతో జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు గురువారం సెలవు ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. సంబంధిత పాఠశాల యాజమాన్యాలు ఈ ఉత్తర్వులను విధిగా పాటించాలని కలెక్టర్ ఆదేశించారు.

## కుండపోత వర్షం

**- మునిగిన మెట్ట పైర్లు.. కుళ్లిన నారుమళ్లు**

చిట్టమూరు, అక్టోబర్ 16 ప్రభాతవార్త



చిట్టమూరు మండల వ్యాప్తంగా తుపాను ప్రభావంతో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. గత రెండు రోజులు నుంచి మండలంలో ఎడ తెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వలన మెట్ట ప్రాంతాల పైర్లు నీట మునగగా, మాగాణి రైతులు వేసిన నారుమడులు సైతం నీటిలోనే మగ్గుతున్నాయి. చిట్టమూరు మండలంలో అత్యధికంగా బుధవారం 70 మిమీలకు పైగా వర్షపాతం నమోదు కావడం, మరోవైపు సూళ్లూరుపేట ప్రాంతంలో తుపాను తీరం దాటే అవకాశం ఉండటంతో రాత్రి కురిసే వర్షంపై రైతులు బెంబేలెత్తుతున్నారు. ఇప్పటికే ఆయా గ్రామాల్లోని చెరువులు పూర్తిస్థాయిలో నీట నిల్వలు లేకపోయినప్పటికీ పంట పొలాలు మాత్రం చెరువులను తలపించేలా నీటి ప్రవాహంతో దర్శనమిస్తున్నాయి. ఓ వైపు అధికారులు ఆయా గ్రామాల్లో తిరుగుతూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సురక్షిత ప్రాంతాలకు తరలించే ప్రయత్నాలు అరకొరగా సాగుతుండటం అధికారుల నిర్లక్ష్యానికి సాక్షంగా చెప్పవచ్చు. ముఖ్యంగా చిట్టమూరు మండలం వ్యవసాయ రంగంతో పాటు ఆక్వా రంగంలో ముందుంది. రొయ్యల గుంటల వద్ద ఉన్న కాపలాదారుల విషయంలో ఏ అధికారి కూడా అక్కడికి వెళ్లి వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించే ప్రయత్నాలు చేయకపోవడం వారి పట్ల ఉన్న బాధ్యత ఏపాటిదో తెలుస్తోంది. ఈశ్వరవాక, పిట్టవానిపల్లి, చిట్టమూరు, మల్లాం, పిట్టేటికండ్రిగ, జక్కనివానిపల్లి, ఆరూరు తదితర ప్రాంతాల్లో ఆక్వా సాగు విస్తారంగా ఉంది. అయితే ఈ ప్రాంతాల్లో రొయ్యల కట్టల వద్ద పూరిపాకల్లో నివసిస్తున్న కూలీల పరిస్థితి ఆగమ్య గోచరంగా మారిందని చెప్పవచ్చు. ఉన్నతాధికారులు ఆదేశాలిస్తున్నా మండల స్థాయి అధికారులు వలస కూలీలు, రొయ్యలగుంట కాపలాదారుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

## దర్గాగా ప్రభుత్వ భూమి కబ్జా

**గత ప్రభుత్వంలో ఇళ్ళ స్థలాలకు కేటాయించిన భూమిని రీ-సర్వేలో తన సొంతం చేసుకున్న వైనం**

గుడిపాల, అక్టోబర్ 16 ప్రభాతవార్త:
నిరుపేదలకు ఇళ్ళ స్థలాలు కేటాయించడానికి నిర్ధేశించిన భూమిని ఓ వ్యక్తి రెవెన్యూ శాఖలో తన పలుకుబడి ఉపయోగించి తన పేరిట మార్చుకున్నారు. ఇంటి పట్టాల కోసం నిరుపేదలు గొంతు చించుకుని అరుస్తున్నప్పటికీ స్థలం లేదని రెవెన్యూ అధికారులు చేతులు ఎత్తివేస్తుండగా అధికారం వున్న వారి దర్గాగా ప్రభుత్వ భూములను ఆక్రమించుకుని అనుభవిస్తున్నారు. గుడిపాల మండలం వసంతాపురం పంచాయతీ పశుమంద గ్రామ పరిసరాల్లో సర్వేనె.44లో 2.50 ఎకరాల విస్తీర్ణంలో ప్రభుత్వ భూమి వుంది. గత ప్రభుత్వం ఈ భూమిలో నిరుపేదలకు ఇళ్ళ స్థలాలు కేటాయించాలని కొంతభాగం చదును చేసింది. భూమిని చదును చేసిన వారికి ఇందుకు సంబంధించి బిల్లులు సైతం గత ప్రభుత్వం చెల్లించింది. అయితే ఎప్పుడు ఏం జరిగిందో తెలియదు! ఆపై రెవెన్యూ అధికారులు ఆ భూమి మాట ఎత్తలేదు. ఈ క్రమంలో వసంతాపురం గ్రామంకు చెందిన ఓ వ్యక్తి గత ప్రభుత్వంలో జరిగిన రీ-సర్వేలో సచివాలయ సర్వేయర్లు, వీఆర్‌ఓలను తన చేతుల్లో వుంచుకుని తన పేరిట ఈ భూమి వున్నట్లు రికార్డు చేసుకున్నట్లు తెలిసింది. ఈ మేరకు భూముల రీ-సర్వేలో ఈ భూమికి సంబంధించి ఎల్‌పిఎం నెం.444 నమోదైనట్లు సమాచారం. ఈ భూమిని మరోసారి సబ్ డివిజన్ చేసినట్లు సర్వే నెం.44/6గా ఈ భూమిని మార్చుకుని లక్షల రూపాయల విలువైన భూమిని ఆ వ్యక్తి దర్గాగా ఆక్రమించుకుని అనుభవిస్తున్నారు.

### అవును నిజం: తహసిల్దారు చంద్రశేఖర్‌రెడ్డి

పశుమంద గ్రామ పరిసరాల్లో 2.50 ఎకరాల విస్తీర్ణ ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందని కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుండి ఫిర్యాదు అందిందని, కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాల మేరకు బుధవారం భూమి వున్న స్థలంకు వెళ్ళి పరిశీలించి వచ్చినట్లు తహసిల్దారు చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. దీనిపై విచారించి ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందని స్పష్టమైతే విచారించి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

## అమెరికాలో రోడ్డు ప్రమాదం

**తిరుపతి జిల్లాకు చెందిన వారు మృతి**

శ్రీకాళహస్తి, అక్టోబర్ 16 ప్రభాతవార్త
టెక్సాస్ నుంచి డల్లాస్‌కు తిరిగి వెళ్ళి వస్తుండగా ఎదురుగా వస్తున్న కారును ఢీకొనడంతో ప్రమాదం చోటు చేసుకుంది. శ్రీకాళహస్తి నియోజకవర్గం తొట్టంబేడు మండలం చిట్టత్తూరు గ్రామానికి చెందిన హరిత, పెద్దకనపర్తికి చెందిన న్యాయవాది రమేష్‌నాయుడు కుమారుడు శివ(32), గూడూరుకుచెందిన తిరుమల గోపిలు అక్కడికక్కడే మృతిచెందారు. శ్రీకాళహస్తి నియోజకవర్గం తొట్టంబేడు మండలం చిట్టత్తూరు గ్రామానికి చెందిన దేగపూడి.భాస్కర్‌రెడ్డి, లత దంపతుల కుమార్తె దేగపూడి.హరితకు 2022 ఫిబ్రవరి 11న కెవిబిపురం మండలం కాళంగి ఆదరం గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ పూర్తిచేసిన సాయిచందుతో వివాహం జరిపించారు. అమెరికాలోని టెక్సాస్ సమీపంలో హరిత భర్త సాయిచందు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా పనిచేస్తున్నాడు. భార్య హరిత మరో కొద్దిరోజుల్లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఉద్యోగంలో చేరాల్సి ఉంది. వారం చివరిరోజుల్లో సెలవు కావటంతో హరిత, ఆమె భర్త సాయిచందు, తొట్టంబేడు మండలం పెద్దకనపర్తి గ్రామానికి చెందిన న్యాయవాది రమేష్‌నాయుడు కుమారుడు శివ(32), గూడూరుకు చెందిన తిరుమలగోపితో పాటు టెక్సాస్ నుంచి డల్లాస్‌కు తిరిగి వెళ్ళి వస్తుండగా ఎదురుగా వస్తున్న కారును ఢీకొనడంతో ప్రమాదం చోటు చేసుకుంది. కారులో ప్రయాణిస్తున్న హరిత, శివ, గూడూరుకు చెందిన తిరుమలగోపిలు అక్కడికక్కడే మృతి చెందారు. కారును నడుపుతున్న హరిత భర్త తీవ్రంగా గాయపడి చికిత్స తీసుకుంటున్నారు.

## అధికారులందరూ అప్రమత్తంగా ఉండండి

### కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్



తిరుపతి కార్పొరేషన్, అక్టోబర్ 16, ప్రభాతవార్త
బంగాళాకాతంలో ఏర్పడిన అల్పపీడనం వల్ల తిరుపతి జిల్లా మూడు రోజులుగా ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జిల్లాలోని అధికార యంత్రాంగం ఎటువంటి మానవ, పశు ప్రాణ నష్టం ఆస్తి నష్టం సంభవించకుండా అప్రమత్తంగా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ పేర్కొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో 16వ తేది ఉదయం నుండి సాయంత్రం 5 గంటల వరకు సగటు వర్షపాతం సుమారు 40.40 మిమి నమోదైందని, అత్యధికంగా ఏర్పేడు మండలంలో 98.80 మిమి వర్షపాతం నమోదైందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 208 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, అందులో 1183 మందిని 52 హ్యాబిటేషన్ల నుండి తరలించి పునరావాస కేంద్రాల్లో ఉంచి వారికి ఆహారం, త్రాగునీరు అవసరమైన మందులు ఏర్పాటు చేసామన్నారు. చెరువులు తెగిపోవడం లాంటివి ప్రస్తుతానికి జరగలేదని, అయినప్పటికి అప్రమత్తంగా ఐదువేల ఇసుక బస్తాలు, 50 టిప్పర్లు అందుబాటులో ఉంచుకుని ఏదైనా చెరువులు కట్ట తెగిపోవడం, గండ్లు పడడం వంటివి ఏర్పడినప్పుడు వాటికి సత్వరమే మరమ్మత్తులు చేసే విధంగా అప్రమత్తంగా అధికారులను సమయాత్తం చేయడమైందని తెలిపారు. కండలేరు రిజర్వాయర్ 68 టిఎంసిల నీటి నిలువ సామర్థ్యం ఉండగా అందులో ప్రస్తుతం 33.15 టిఎంసిల నీరు నిలువ ఉందని ఇన్ఫ్లో 5600 క్యూసెక్కుల వర్షపు నీరు వస్తోందని అవుట్ ఫ్లో 345 క్యూసెక్కులుగా ఉన్నదని తెలిపారు. కాలంగి రిజర్వాయర్ 0.240 టిఎంసిల సామర్థ్యం కాగా 0.078 టిఎంసిలనీరు ప్రస్తుతం నిలువ ఉందన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## వైద్య విద్యార్థులు ఉన్నత లక్ష్యాల దిశగా అడుగులు వేయాలి

– పిఇఎస్ మెడికల్ డైరెక్టర్ డా॥ సురేష్ కృష్ణమూర్తి

– ఘనంగా 23వ బ్యాచ్ ఎంబిబిఎస్ తరగతులు ప్రారంభం !!



**కుప్పం, అక్టోబర్ 16 ప్రభాతవార్త** వైద్య విద్యార్థులు విద్యలో రాణించి ఉన్నత లక్ష్యాల దిశగా అడుగులు వేయాలని పిఇఎస్ వైద్య కళాశాల మెడికల్ డైరెక్టర్ డా॥ సురేష్ కృష్ణమూర్తి పేర్కొన్నారు. బుధవారం పిఇఎస్ ఆడిటోరియంలో 23వ బ్యాచ్ ఎంబిబిఎస్ తరగతులను ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పి5 ప్రణాళికతో ముందుకుసాగాలని సూచించారు. ప్యాషన్, ప్రణాళిక, వ్యక్తిగత, శారీరక ఆరోగ్యం తదితరాల ప్రాధాన్యత గురించి వివరించారు. పిఇఎస్ వైద్య కళాశాల ఎంతోమంది వైద్యులను రూపొందించిందన్నారు. రాష్ట్రంలోనే తమ కళాశాల వైద్య విద్యలో ఓ ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉందన్నారు. ఇక్కడ నిబద్ధత కలిగిన అధ్యాపకులు, యాజమాన్యం పనిచేస్తోందన్నారు. వైద్య విద్యార్థులు విద్యలో పరిశోధనలపై మక్కువ చూపితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. డీన్, ప్రిన్సిపాల్ డా॥ హెచ్ఆర్ కృష్ణారావు మాట్లాడుతూ పిఇఎస్ వైద్య కళాశాల ఓ కుటుంబం లాంటిదన్నారు. ముఖ్యఅతిథులు బెంగళూరు హెచ్‌సిజి రీజనల్ డైరెక్టర్ డా॥ విశాల్‌రావు మాటా ్లడుతూ కోవిడ్ ముందు ఆ తర్వాత వైద్యుల పాత్రలో వచ్చిన మార్పులు వివరించారు. క్యాటిస్ గ్రూప్ ఛైర్మన్ డా॥ చం ద్రశేఖర్ మాట్లాడుతూ వైద్య విద్య యొక్క ప్రాధాన్యతను వివరించారు. అనంతరం ఫస్టియ ర్‌లో డిస్టింక్షన్లు సాధించిన విద్యార్థులకు పురస్కారాలు అందించారు. మెడికల్ సూపరిం టిండెంట్ డా॥ సుబ్రమణ్య, వైస్ ప్రిన్సిపాళ్లు డా॥ ర్యాలీ సుబ్బారావు, డా॥ హరీష్, నర్సింగ్ ప్రిన్సిపాల్ డా॥ అభిరామి, అల్లైడ్ హెల్త్ సైన్సెస్ ప్రిన్సిపాల్ డా॥ బిజిష్, హెచ్‌ఒడిలు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్‌లో అంతర్ వర్సిటీ ఫుట్‌బాల్ జట్టు సెలక్షన్స్



**కుప్పం, అక్టోబర్ 16 ప్రభాతవార్త** అనంతపురం జెఎన్‌టియు పరిధిలోని కళాశాలలకు సంబంధించి అంతర్ యూనివర్సిటీ ఫుట్‌బాల్ జట్టు సెలక్షన్స్ కార్యక్రమాన్ని బుధవారం కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్‌లో నిర్వహించారు. ఈసందర్భంగా అనంతపురం జెఎన్‌టియు స్పోర్ట్స్ కౌన్సిల్ కార్యదర్శి జోజిరెడ్డి, బిసిఎన్ గ్రూప్స్ ఛైర్మన్ బిసి నాగరాజ్, కెఇసి వైస్ ఛైర్మన్ డా॥ సునీల్ రాజ్, సిఇఒ సాగర్ రాజ్‌లు క్రీడాకారుల ఎంపిక సెలక్షన్స్‌ను ప్రారంభించారు. జోజిరెడ్డి మాట్లాడుతూ కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్ అన్ని వసతులతో కలిగిన క్రీడా ప్రాంగణం కలిగి ఉందన్నారు. అందుకే వర్సిటీస్థాయి జట్ల ఎంపికను ఇక్కడ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాగా ఫుట్‌బాల్ జట్టుకు కెఇసికి చెందిన ముగ్గురు విద్యార్థులు డేరిన్ డేవిస్, శ్రీహరివిజుకుమార్, అభిలు ఎంపికయ్యారు. వీరిని ఛైర్మన్ అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా॥ సుధాకర్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ డా॥ భాస్కరన్, ఆర్అండ్‌డి డైరెక్టర్ డా॥ కోదండరామయ్య, పిడి సతీష్‌కుమార్, ప్రోగ్రాం నిర్వాహకులు మాధవన్, గంగాధర్, పిఆర్వో ప్రవీణ్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు

## అభివృద్ధి..సంక్షేమం సిఎం చంద్రబాబుకు రెండుకళ్లు

– ఎపిఎస్ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం



**కుప్పంరూరల్, అక్టోబర్ 16 ప్రభాతవార్త** రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం సిఎం చంద్రబాబునాయు డుకు రెండు కళ్లు అని ఎపిఎస్ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నా రు. బుధవారం మండలంలోని గరిగచీనేపల్లి, నాయనూరు, బంగానత్తం గ్రామాల్లో పల్లె ప ండగ కార్యక్రమంలో భాగంగా గోకులం షెడ్ల నిర్మాణాలకు ఆయన ఎమ్మెల్సీ, సమన్వయకమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్‌తో కలిసి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను సిఎం చంద్రబాబు అమలు చేస్తున్నారన్నారు. కుప్పాన్ని దేశంలోనే ఆదర్శనియోజకవర్గంగా మలచడమే సిఎం చంద్రబాబు ఆశయమన్నారు. పేదరిక నిర్మూలనకు ఆయన కుప్పం నుంచే శ్రీకారం చుట్టారన్నారు. వైకాపా పాలనలో గ్రామాల్లో అభివృద్ధి పడకేసిందన్నారు. నేడు ఉపాధి నిధులతో గ్రామాల్లో సిసి రోడ్లు, డ్రైన్లు, అంగన్‌వాడీ కేంద్రాలు నిర్మిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర నేత డా॥ బిఆర్ సురేష్‌బాబు, మండల పార్టీ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, మాజీ ఎంపిపి డా॥ వెంకటేష్, పార్టీ విస్తరణ కమిటీ సభ్యుడు కన్నన్, ఎంపిడిఓ సాయిలహరి, సర్పంచులు ధనశేఖర్, రోహిత్ రవి, కావ్య, మహిళా నేత వసంతమ్మ, కౌన్సిలర్ సోమశేఖర్, నేతలు దివాకర్, మురుగేష్, ఎవి రవి, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## నాయనూరులో తెదేపా పతాకావిష్కరణ



**కుప్పంరూరల్, అక్టోబర్ 16 ప్రభాతవార్త** మండలంలోని నాయనూరులో తెలుగుదేశం పార్టీ పతాకాన్ని ఎమ్మెల్సీ, సమన్వయ కమిటీ ఛైర్మన్ డా॥ క ంచర్ల శ్రీకాంత్ ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో నూతన సచివాలయ భవనం, త్రాగునీటి బోరును ప్రారంభించారు. కార్యక్రమంలో ఎపిఎస్ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, రాష్ట్ర నేత డా॥ బిఆర్ సురేష్‌బాబు, మండల పార్టీ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, మాజీ ఎంపిపి డా॥ వెంకటేష్, ఎంపిడిఓ సాయిలహరి, కంగుంది సర్పంచ్ ధనశేఖర్, నేతలు కన్నన్,

## మంచినీటి సంపులో పడ్డ ఎద్దు

–రక్షించిన స్థానికులు



చౌడేపల్లి, అక్టోబర్ 16 ప్రభాతవార్త

మంచినీటి సంపులో పడ్డ ఎద్దును స్థానికులు రక్షించిన సంఘటన చౌడేపల్లిలో చోటు చేసుకుంది. పట్టణంలోని ఎమ్మెల్యే వీధికి చెందిననాగరాజు ఒంటెద్దు బండిని నడుపుకొంటూ జీవిస్తున్నాడు. వర్షం కారణంగా వీధిలోని చివర్లో పశుగ్రాసం వుండటంతో అక్కడ తన ఎద్దును కట్టేశాడు. పశువు గడ్డిని మేస్తూ ప్రమాదవశాత్తు మంచినీటీ సంపులోకి పడింది. గుర్తించిన స్థానికులు జెసిబి సాయంతో ఎద్దును సంపులోంచి సురక్షితంగా బయటకు తీశారు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకొన్నారు.

## ఎడా పెడా వర్షంతో స్తంభించిన జనజీవనం

–నీట మునిగిన పంటలు



చౌడేపల్లి, అక్టోబర్ 16 ప్రభాతవార్త

మండల వ్యాప్తంగా ఎడా పెడా కురుస్తున్న వర్షానికి జనజీవనం స్తంభించింది. అంతేకాకుండా వరి, పండ్లతోటలు దెబ్బతిన్నాయి. గత రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తోంది. అక్కడక్కడ విద్యుత్ తీగలపై చెట్లు పడటం వల్ల విద్యుత్ సరఫరాకు సైతం అంతరాయం వాటిల్లింది. మండల వ్యాప్తంగా 883హెక్టార్లలో వరి పంటను సాగు చేసారు. అదే విధంగా 2500ఎకారాల్లో పండ్లతోటలు, 300ఎకరాల్లో టమోటా, 54ఎకరాల్లో పూలతోటలను రైతులు సాగు చేస్తున్నారు. కొండామర్రి, వెంగళపల్లి, పందిళ్ళపల్లి తదితర పంచాయతీ గ్రామాల పరిధిల్లో వరి, టమోటా, పూలతోటలు కోతకు వచ్చే సమయానికి వర్షం వల్ల దెబ్బతిన్నాయి. దీంతో రైతులు లబోదిబో మంటున్నారు. పంటలు చేతికంది రుణభారం తీర్చుకొందామనుకొంటే మాయదారి వర్షం తమను నిలువునా ముంచేసిందని వారు వాపోతున్నారు. సంబంధిత అధికారులు దెబ్బతిన్న పంటలను సందర్శించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

## ప్రజలకు నష్టం జరుగకుండా అప్రమత్తం

– ఎమ్మెల్యే డాక్టర్ థామస్

**శ్రీరంగరాజపురం, అక్టోబర్ 16 ప్రభాతవార్త:** తుఫాను సందర్భంగా ప్రజలకు నష్టం జరుగకుండా అధికారులు అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని జిడినెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ వివిఎం థామస్ అన్నారు. ఎంపిడిఓ కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ వి.ఎం.థామస్ శ్రీరంగరాజపురం, వెదురుకుప్పం మండల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా మండలాల పరిధిలో వాగులు, వంకలు, చెరువులు పొంగి పొర్లుతున్నట్లైతే ప్రజలను సత్వరం అప్రమత్తం చేయాలన్నారు. రెవెన్యూ, విద్యుత్, వైద్య, వ్యవసాయ శాఖల అధికారులు అప్రమత్తంగా వుండి భారీ వర్షాలతో దెబ్బ తిన్న ప్రాంతాల్లో యుద్ధ ప్రాతిపదికన మరమ్మత్తులు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో మండల దేశం అధ్యక్షుడు గంధమనేని జయశంకర్‌నాయుడు, తహసిల్దారు లోకనాథపిళ్ళై, ఎంపిడిఓ మోహన్‌మురళీ, ఎస్ఐ సుమన్, వెదురుకుప్పం తహసిల్దారు రమేష్‌బాబు, ఎంపిడిఓ అమరనాథ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## పాఠశాల ప్రహరిగోడకు భూమి పూజ

శ్రీరంగరాజపురం, అక్టోబర్ 16 ప్రభాతవార్త:

పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల పరిధిలో ఒడ్డుపల్లె, కెకె కండిగ పంచాయతీల్లో మంజూరైన పాఠశాల ప్రహరి గోడల నిర్మాణం, సిమెంటు రోడ్ల పనులకు ఎంపిడిఓ మోహన్‌మురళీ, స్థానిక సర్పంచ్‌లు భూమి పూజ నిర్వహించారు. ఎంపిడిఓ మాట్లాడుతూ ఉపాధి, పంచాయతీ నిధులతో పాఠశాల ప్రహరిగోడల నిర్మాణాలు, సిమెంటు రోడ్ల పనులు మంజూరు అయ్యాయన్నారు. మాజీ ఎంపిటిసీ వేమననాయుడు, కెఎం రవి, ఎపిఓ చంద్రశేఖర్, టెక్నికల్ అసిస్టెంట్ రేఖ, ఉపాధి సిబ్బంది, తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

– ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్



బంగారుపాళ్యం, అక్టోబర్ 16 ప్రభాతవార్త:

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ అన్నారు. బుధవారం మండలం నందు పల్లె పండుగ కార్యక్రమంను అధికారులు చేపట్టారు. వెంకటాపురం, తంబుగానిపల్లి, నలగాంపల్లి, సదకుప్పం, తుంబకుప్పం గ్రామాల్లో సిసి రోడ్ల నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పల్లె పండుగ కార్యక్రమం కింద పలు గ్రామాల్లో సిమెంటు రోడ్లు, పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్‌పి జయప్రకాష్, జనార్ధన్‌గౌడ్, ఇన్‌ఛార్జీ ఎంపిడిఓ శ్రీధర్, మండల తెలుగు యువత అధ్యక్షుడు రమేష్, నాయకులు హరిప్రసాద్, గిరిబాబు, ఎన్‌పి ధరణి తదితరులు పాల్గొన్నారు.

## పక్కాగా విధులు నిర్వర్తించి ప్రజల సమస్యలు పరిష్కారానికి చర్యలు

– పాలసముద్రం తహసిల్దారు, ఎంపిడిఓలకు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం



**పాలసముద్రం, అక్టోబర్ 16 ప్రభాతవార్త:** పక్కాగా విధులు నిర్వర్తించి మండల ప్రజల సమస్యలను సత్వరం పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ పాలసముద్రం మండల ఎంపిడిఓ విద్యావతి, తహసిల్దారు అరుణకుమారిలను ఆదేశించారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ బుధవారం పాలసముద్రం మండలంలో ఎంపిడిఓ, తహసిల్దారు కార్యాలయం, పిహెచ్‌సిని అకస్మికంగా తనిఖీ చేసి విధి నిర్వహణపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. తహసిల్దారు కార్యాలయంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ రికార్డుల వివరాలను తహసిల్దారు అరుణకుమారిని అడిగి తెలుసుకున్నారు. రిజిస్ట్రేషన్లకు సంబంధించి ధరణి ప్రక్రియను సక్రమంగా నిర్వర్తించాలని, సాంకేతిక సమస్యలు ఎదైనా తలెత్తితే సత్వరం కలెక్టరేట్ సిబ్బంది దృష్టికి తీసుకెళ్ళి సత్వరం పరిష్కరించుకోవాలన్నారు. అనంతరం ఎంపిడిఓ కార్యాలయంను తనిఖీ చేసిన కలెక్టర్ ప్రజల నుండి సమస్యలపై వచ్చిన అర్జీల పరిష్కారానికి సత్వరం చర్యలు తీసుకోవాలని ఎంపిడిఓ విద్యావతిని ఆదేశించారు. అనంతరం పాలసముద్రం పిహెచ్‌సిని తనిఖీచేసిన కలెక్టర్ భారీ వర్షాలతో క్షేత్ర స్థాయిలో ప్రజలకు వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. వనదుర్గాపురం సర్పంచ్ నరసింహరాజు కలెక్టర్‌ను కలిసి విన్నవిస్తూ తన మీద కక్షతో కొంతమంది పంచాయతీ పరిధిలో కుక్కలు, కోతులు, అడవి పందులు పట్టాలని జిల్లా అధికారులకు స్పందన కార్యక్రమంలో అర్జీలు పెడుతున్నారని, తనను ఇబ్బంది పెట్టడానికి పంచాయతీలో కొందరు ప్రయత్నిస్తున్నారని వాపోయారు. విచారించి చర్యలు తీసుకోవాలని ఎంపిడిఓను ఆదేశించారు. వెంగళరాజుకుప్పం పంచాయతీ వైస్ సర్పంచ్ సుమన్‌రాజు పంచాయతీ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కలిసి విన్నవించారు. కార్యక్రమంలో తహసిల్దారు అరుణకుమారి, ఎంపిడిఓ విద్యావతి, మెడికల్‌ఆఫీసర్‌డాక్టర్ మోహన్‌కృష్ణ, సిహెచ్ఓ జ్ఞానశేఖర్, ఇఓఆర్డీ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి అండర్-17 ఫెన్సింగ్ పోటీలకు క్రీడాకారులు ఎంపిక

***యాదమరి, అక్టోబర్ 16 ప్రభాతవార్త:*** రాష్ట్ర స్థాయి అండర్–17 ఫెన్సింగ్ పోటీలకు యాదమరి జడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో బుధవారం క్రీడాకారుల ఎంపిక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య కార్యదర్శి వసంతవాణి, యాదమరి జడ్పీ ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్ గిరిరాజా, పాఠశాల పిడి రవిలు పాల్గొని క్రీడాకారులను ఎంపిక చేశారు. ప్రస్తుతం ఎంపికైన క్రీడాకారులు నంద్యాలలో జరుగనున్న 68వ రాష్ట్ర పోటీల్లో పాల్గొననున్నారని జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య కార్యదర్శి వసంతవాణి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పిడిలు సెల్వపాండియన్, కృష్ణయ్య, సిరాజ్ అహ్మద్, బాబు, శరత్, నూర్‌అహ్మద్, ఉమాపతి, శాప్ కోచ్‌లు రవి, కార్తీక్‌లు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి

–డీఎంఅండ్‌హెచ్ఓ ప్రభావతి



**తవణంపల్లె, అక్టోబర్ 16 ప్రభాతవార్త:** ప్రస్తుత వర్షాకాలంలో గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ ప్రభావతి అన్నారు. బుధవారం మండలంలోని కె.పట్నం సబ్‌సెంటర్‌ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా సబ్‌సెంటర్ ఫరిధిలోకి వ్యాధి నిరోధక టీకాలు, మాతా శిశుసంరక్షణ కార్యక్రమాలు, పలు రికార్డులను పరిశీలించారు. ఈసందర్భంగా ప్రస్తుతం మండలంలో జోరు వర్షాలు కురుస్తున్నందున సీజల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా డయేరియా, మలేరియా, డెంగ్యూ వంటి అంటు వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే మండలంలోని వైద్యాధికారులు రోజువారి కార్యాచరణలో భాగంగా పాఠశాలలు, వసతిగృహాలలో నీటి టెస్టింగ్‌లు, మెడికల్ క్యాంపులు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ప్రభావతి నిర్దేశించారు. అలాగే వ్యాధినిరోధక టీకాలు, బ్రెస్ట్ ఫీడింగ్, పౌష్టికాహార, రక్తహీనతపై తల్లులకు అవగాహన కలి ్పంచాలని ప్రభావతి సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక, సూపర్‌వైజర్ రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామ పరిపాలనపై అవగాహన ఉండాలి : కృష్ణవేణి



**చౌడేపల్లి, అక్టోబర్ 15 ప్రభాతవార్త** గ్రామ పరిపాలనపై అవగాహన కల్గి వుండాలని ఇఓఆర్‌డీ కృష్ణవేణి అన్నారు. స్థానిక పరిపాలనా భవనంలో పంచాయతీల పాలనపై ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, కార్యదర్శులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామాల అభివృద్ధిపై ప్రణాళికలు, ఉపాధిహామీ పథకం, వీధి దీపాలు, 15ఫైనాన్స్ నిధుల ఖర్చుల వినియోగం, చెత్త నుంచి సంపద కేంద్రాలు వంటివాటిపై అవగాహన కల్పించారు, మండలంలోని ఉపసర్పంచులు, వారడ్లు సభ్యులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## విపత్తుల బాధితులకు అండగా నిలవడం అభినందనీయం

: ఎమ్మెల్యే సునీల్ కుమార్



**గూడూరు, అక్టోబర్ 16, ప్రభాతవార్త** విపత్తుల బాధితులకు దాతలు, స్వచ్ఛంద సంస్థలు అండగా నిలవడం అభినందనీయమని ఎమ్మెల్యే సునీల్ కుమార్ అన్నారు. బుధవారం గూడూరు రెండవ పట్టణ పరిధిలోని శ్రీరామరక్ష కుటీరంలో శ్రీరామరక్ష సేవా సంఘం నాయకులు సిఎం సహాయనిధికి 25 వేల రూపాయిల చెక్కును గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్‌కు అందజేశారు. శ్రీరామరక్ష సేవా సంఘం నాయకులు చిట్టిబాబు సిఎం సహాయ నిధికి అందజేసిన 25 వేల రూపాయిలు చెక్కును అందుకున్న గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ ఇటీవల సంభవించిన వరదల కారణంగా దెబ్బతిన్న విజయవాడ నగర ప్రజలను ఆదుకునేందుకు గూడూరు నియోజకవర్గం పరిధిలో తెలుగుదేశం పార్టీ నాయకులు స్వచ్ఛంద సంస్థలు ఫ్యాక్టరీల యాజమానులు పలువురు దాతలు ముందుకు వచ్చి మూడు కోట్ల రూపాయలకు పైబడి సిఎం సహాయ నిధికి విరాళాలు అందజేసారు. ప్రస్తుతం మన ప్రాంతానికి కూడా తుఫాను ముప్పు పొంచి ఉండడంతో తుఫాను బారిన పడిన మన ప్రాంతం వారిని ఆదుకునేందుకు తన నెల జీతాన్ని కూడా ఇచ్చేందుకు ముందుకు వస్తానని ఎమ్మెల్యే సునీల్ కుమార్ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పులిమి శ్రీనివాసులు, తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## పునరావాస కేంద్రాన్ని తనిఖీ చేసిన ఎమ్మెల్యే విజయశ్రీ



**తడ, అక్టోబర్ 16 ప్రభాతవార్త** తడ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను బుధవారం సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తనిఖీ చేశారు. పునరావాస కేంద్రంలో ఉన్న ముంపు ప్రాంత ప్రజలతో మాట్లాడి వారికి వసతులు సక్రమంగా ఉన్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. భారీ వర్షం సూచన ఉన్న నేపథ్యంలో పునరావాస కేంద్రాల్లో సురక్షితంగా ఉండాలని సూచించారు. వర్షాలు ఆగిన తర్వాత పునరావాస కేంద్రాల నుంచి తిరిగి స్వస్థలాలకు వెళ్లవచ్చని ఎమ్మెల్యే తెలియజేశారు. ఈ సందర్భంగా పునరావాస కేంద్రంలో ఉన్న వారికి ఎమ్మెల్యేతో పాటు ఆమె భర్త పార్ధసారధి, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ఉయ్యాల ప్రవీణ్ చేతులు మీదుగా ఆహార పొట్లాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ విజయకుమార్, టిడిపి మండల అధ్యక్షులు కామిరెడ్డి మురళీరెడ్డి, రవి, గుణసుందరి, రాజారెడ్డి, రామ్మూర్తి, కల్యాణి, దేశప్పన్, భాస్కర్, తడ సర్పంచ్ ఆర్ముగం తదితరులు ఉన్నారు.

## ఎన్‌టిఆర్ ఇళ్లపై సర్వే

**కోట, అక్టోబర్ 16 ప్రభాతవార్త** కోట మండలంలోని 2016 నుంచి 2019 వరకు ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకంలో ఇళ్ల మంజూరై నిర్మించుకుని ఉన్న వారి గృహాలు ఏదశలల్లో ఉన్నాయో వాటిపై పరిశీలన ( రీవెర్ఫికేషన్ ) చేసున్నట్లు గృహనిర్మాణ సంస్థ ఎఇ భాస్కర్ రావు చెప్పారు. గ్రామ సచివాలయాల ఇంజినీరింగ్ అసిస్టెంట్లు సంబంధిత లబ్ధిదారులకు ఇళ్లకు వేళ్లి పరిశీలన జరుపుతున్నారు. గత ప్రభుత్వ హయంలో అనర్హులను లబ్ధిదారులగా చేర్చారా అనే కోణంలో కూడా విచారణ జరుపుతున్నారు. నిజంగా ఇంకా ఎవరికి బిల్లు రావాలి ఏంత మంది ఉన్నారాని పరిశీలన జరుపుతున్నారు. కోట మండలంలో 707 మంజారు అయ్యాయ్యాయి. లబ్దిదారులు ఇంటి నిర్మాణం పూర్తి చేసుకున్నారా లేదా శ్లాబు వేశారా ఇం కా బిల్లులురావాల్సి ఉందా ఉంటే ఏంత అనే దానిపై విచారణ జరుపుతున్నామని ఎఇ భాస్కర్‌రావు తెలిపారు.

## కోటలో అధ్వానంగా రహదారులు



**కోట, అక్టోబర్ 16 ప్రభాతవార్త**గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు కారణంగా కోట మండలంలోని ఆర్ అండ్‌బిరహదారులుమరి అధ్వానంగా మారాయి. ఉత్తమ నెల్లూరు.. దొరువుకట్ట, కోట.. ఉత్తమనెల్లూరు, కోట..కోట క్రాస్ రోడ్డు, కోట.. జరుగుమల్లి , విద్యానగర్, గూడలి రహదా రులు ప్రయాణంటే ప్రజలు భయపడిపోతున్నారు. రహదారిపై ఉన్న గుంతల్లో వర్షం నీరు నిలిచి చెరువులను తలపిస్తున్నాయి. గుంతల లోతు అర్ధం కాక ప్రయాణీకులకు రాకపోకలు ఇబ్బందిగా మారాయి. ప్రమాదం భారిన పడే అవకాశం ఉందేమో అని వాహనాచోదకులు భయపడు తున్నారు. మరో పక్క సాక్షాత్తు సీఎం చంద్రబాబు నాయుడు ఈనెలఖారి లోపల రోడ్లు పై పడిన గుంతలను పూడ్చాలని అధికారులను ఆదేశించారు. మరి అర్అండ్ అధికారులు మరో 14 రోజుల లోపల మండలంలోని వివిధ గ్రామాల మధ్య ఏర్పడిన రోడ్లు గుంతలు పూడ్చుతారా అనేది వేచి చూడాల్సిన ప్రశ్నగా ఉంది. సీఎంహామీనిఅధికారులను నిలబెడుతారా అనేది ప్రస్తుతం మండల ప్రజలు చర్చించు కుంటున్నారు.

## భారీ వర్షాలకు ప్రత్యేకాధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలి



**దక్కిలి, అక్టోబర్ 16 ప్రభాతవార్త)ః** దక్కిలి మండలంలో తుఫాన్ ప్రభావంగా భారీ వర్షాలకు ప్రజలు ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా సచివాలయాలకు కేటాయించిన ప్రత్యేకాధికారులు ఎప్పటికప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని తహసీల్దార్ మోపూరు శ్రీనివాసులు వారికి ఆదేశాలు ఇచ్చామన్నారు. బుధవారం ఆయన మండలంలోని లింగసముద్రం కొండేరు వాగు, మాటుమడుగు కైవాల్యనది, అత్తల సిద్దవరం, అలపలేరు ప్రాంతాల్లో ఉన్న ఏరులు పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మూడు రోజులు నుంచి వర్షాలు అధికంగా కురుస్తుండడం వల్ల రాబోయే రోజుల్లో వాగులు, ఏరులు ప్రవహించే అవకాశం ఉందని జిల్లా స్థాయి అధికారులు నుంచి వచ్చిన సమాచారం మేరకు అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. మండలంలోని మాటుమడుగు, శ్రీపురం, గోల్లపల్లి గ్రామాలలో ఆనుకుని ఉన్న కైవల్యానది బ్రిడ్జీలపైన వరద ప్రవాహం ఉండడం వల్ల ఈప్రాంతంలో రాకపోకలకు ప్రజలు అనుమతించకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆయన వెంట డక్కిలి ఎస్సై శివశంకర్, ఏఎస్ఓ వెంకటయ్య తదితరులు ఉన్నారు.

## ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దు

– తహశీల్దార్ జయజయరావు



**కోట, అక్టోబర్ 16 ప్రభాతవార్త** దక్షిణ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తీవ్ర వాయుగుండంగా బలపడుతున్న నేపథ్యంలో వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. గంటకు 35 నుంచి 45 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని స్పష్టం చేసింది. రానున్న 24 గంటల్లో భారీ వర్షాలతో పాటు ఫ్లాష్ ఫడ్‌కు అవకాశం ఉందని పేర్కొంది. దీంతో అధికార యంత్రాంగం వర్షం ప్రభావిత ప్రాంతాలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. బుధవారం కోట మండలం గోవిందుపల్లి గ్రామంలో మత్స్యకారులకు సంబంధించిన బోట్లను డ్రోన్ కెమెరాతో చిత్రీకరించారు. వేటకు ఎవరూ వెళ్లవద్దని తహశీల్దార్ జయజయరావు కోరారు. కోటలో ఏడు కుటుంబాలకు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేసి భోజన వసతి కల్పించారు. స్వర్ణముఖి పొర్లుకట్టలకు గండ్లు పడకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.

## భయం గుప్పిట్లో దొరువుకట్ట, కర్లపూడి గ్రామాలు

**కోట, అక్టోబర్ 16 ప్రభాతవార్త** భారీ వర్షాల నేపథ్యంలో అధికార యంత్రాంగం గత మూడురోజులు నుంచి చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో స్వర్ణముఖి నదికి వరద వచ్చినా, కాలువ ప్రవాహం తీవ్రంగా వచ్చినా కోట మండలం పుచ్చలపల్లి పంచాయతీ పరిధిలోని దొరువుకట్ట, దెయ్యాలదిబ్బ గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకునే ప్రమాదం ఉందని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదే క్రమంలో కర్లపూడి గ్రామంలోనూ 2016, 2022లో వచ్చిన వరద ప్రభావం వల్ల గండ్లు పడి అక్కడి గిరిజన కాలనీ జలదిగ్బంధంలో చిక్కుకుంది. దొరువుకట్ట, కర్లపూడి గ్రామాలు వారంరోజులుగా బయటి ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. గ్రామాల్లోకి అధికారులు కూడా రాలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో నాటి వరద బీభత్సాన్ని ప్రజలు గుర్తు చేసుకుంటూ బిక్కుబిక్కుమంటున్నారు. అధికారులు ఆయా గ్రామాల వైపు ముందస్తు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు

## పునరావాస కేంద్రాల పరిశీలన



**సూళ్లూరుపేట, అక్టోబర్ 16 ప్రభాతవార్త** సూళ్లూరుపేట పట్టణంలోని జడ్పీ బాలికల హైస్కూల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను ఆర్డీఓ కిరణ్మయి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె అక్కడ ఉన్న బాధితులకు సక్రమంగా ఆహారం, నీరు, ఇతర సదుపాయాలు ఉన్నాయా అంటూ అడిగి వివరాలు తెలుసుకున్నారు. పునరావాస కేంద్రంలో ఉన్న ప్రజలకు తక్షణమే సౌకర్యాలు కల్పించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. అనంతరం పట్టణంలోని లోతట్టు ప్రాంతాలను ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య తదితరులు ఉన్నారు.

## చీకట్లో మగ్గుతున్న గ్రామాలు

**బాలాయపల్లి, అక్టోబర్ 16, ప్రభాతవార్త**

మండలంలోని మన్నూరు పాతూరు, కొత్తఊరు, పల్లిపాడు గ్రామాల్లో మంగళవారం సాయంనరతం నుండి విద్యుత్ సరఫరా ఆగిపోయింది. దీంతో చిన్న పిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయినా విద్యుత్ అధికారులు స్పందించడం లేదని ఇప్పటికైనా విద్యుత్ ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్ పునరుద్ధరణ చేయాలని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## తుఫాను బాధితులను ఆదుకుంటాం

ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ



**వెంకటగిరి, అక్టోబర్ 16, ప్రభాతవార్త** తుఫాను బాధితులను పూర్తిస్థాయిలో ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. వెంకటగిరి పట్టణంలోని సవారిగుంట, కాంపాలెం ప్రాంతాల్లో ఆయన పర్యటించి స్థానికులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. ముందు జాగ్రత్త చర్యగా పట్టణంలోని మొరుగు కాలువలలో పూడిక తీయించామని చెప్పారు. కాలువలో నీరు సాఫీగా ప్రవహించడం వల్ల ఇళ్లల్లోకి రాలేదని తెలిపారు. 32 లక్షల రూపాయిలతో పనులు చేయించినట్లు చెప్పారు. తుఫాన్ ఎక్కువ అయితే అందరికీ ఆహార ప్యాకెట్లు కూడా సరఫరా చేస్తామని తెలిపారు. కైవల్యనది గొద్దేరు వాగులను కూడా ఆయన పరిశీలించారు. ఆయన వెంట సిఐ వెంకటరమణ. ఎస్సై సుబ్బారావు, మాజీ ఏఎంసి చైర్మన్ రాజేశ్వర రావు పద్మశాలు కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గంగాధర్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రాజేశ్వరరావు, నాయకులు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## పారవోలులో పల్లె పండుగ

వెంకటగిరి, అక్టోబర్ 16, ప్రభాతవార్త



పారవోలు గ్రామంలో అధికారులు పల్లె పండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉపాధి హామీ పతకం ఏపివో దీప అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. అభివృద్ధి పనుల వల్ల గ్రామాల్లోని పలువురికి ఉపాధి కలుగుతుందని ఆమె తెలిపారు. టిడిపినాయకులు రామచంద్రయ్య గ్రామస్తులు పాల్గొన్నారు.

## కాలువల్లో పూడిక తీసిన మున్సిపల్ సిబ్బంది



**వెంకటగిరి, అక్టోబర్ 16, ప్రభాతవార్త** పట్టణంలోని తోలిమిట్ట, కాసిపేట సెంటర్ ప్రాంతాల్లో ఉన్న పెద్దపాటి డ్రైనేజీ కాలువలో చెత్తాచెదానం పేరుకుని ఉండడంతో మున్సిపల్ సిబ్బంది చేత అధికారులు తొలగించారు. కాలువల్లో చెత్తాచెదారం పేర్కొని ఉన్నందున నీళ్లు ప్రవహించక వీధుల్లోకి వస్తున్న కాలువలను శుభ్రం చేయించారు. కాలువలో చెట్లు మొలిచి ఉండడంతో వాటిని కూడా శుభ్రం చేశారు. కౌన్సిలర్ శంకరయ్య చొరవతో కాలువలను శుభ్రం చేయడంతో స్థానికులు హర్షించారు.

## తీర ప్రాంతాలలో సమీక్షిస్తున్న అధికారులు



**వాకాడు, అక్టోబర్ 16, ప్రభాతవార్త** మండలంలోని అన్ని ముంపు ప్రదేశాలతో పాటు, తీర ప్రాంత గ్రామాలలో ఎప్పటికప్పుడు తహశీల్దార్ రామయ్య ఎంపిడిఓ అన్నపూర్ణారావు సమీక్షిస్తున్నారు. బుధవారం బంగాళాఖాతంలో బలపడిన తుఫాన్ తీరం దాటే సమయంలో అధికార యంత్రాంగం ఉండాలని ఉన్నత అధికారుల సూచనల మేరకు తహశీల్దార్ రామయ్య, ఎంపిడిఓ అన్నపూర్ణారావులు మాట్లాడుతూ మండల పరిధిలోని దుగ్గరాజపట్నం, తూపిలి పాలెం గ్రామాలలో ముందస్తు చర్యలు భాగంగా తూపిలిపాలెంలో రియాస్టేషన్ సెంటర్, సముద్రం వద్ద ఆటపోట్లను పరిశీలించారు. మండలంలోని లోతట్టు ప్రాంతంలో షెల్టర్ నందు ఉంచామన్నారు. అన్ని ఏర్పాట్లు కూడా చేశామన్నారు. ముందస్తు చర్యలో భాగంగా పునరావాస కేంద్రాలను కూడా ఏర్పాటు చేస్తామన్నారు. మండలంలోని అన్ని పంచాయితీలలో ఎప్పటికప్పుడు అందుబాటులో అధికారులు ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలోరెవెన్యూ ఇన్స్పెక్టర్ అఖిల్, ఈవోపిఆర్డి ఉమామహేశ్వర రావు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

## విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలి



**తడ, అక్టోబర్ 16 ప్రభాతవార్త** తుపాను కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా తగు చర్యలు చేపట్టాలని తిరుపతి ఏపీఎస్‌పీడీసీఎల్ సీజీఎం కె.ఆదిశేషయ్య అధికారులకు సూచించారు. బుధవారం ఆయన తడ మండల పరిధిలోని పలు విద్యుత్ సబ్ స్టేషన్లను అధికారులతో కలిసి తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పుదుచ్చేరి, నెల్లూరు మధ్యలో వాయుగుండం తీరందాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటించిందని చెప్పారు. ఈ నేపథ్యంలో తుపాను కారణంగా ఎటువంటి విపత్తు ఎదురైనా సిద్ధంగా ఉండాలన్నారు. ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టి విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని కోరారు. ఆయన వెంట నాయుడుపేట ఇఇ వై.శ్రీనివాసులు, తడ ఏఇ కె.మురళి, సూళ్లూరుపేట డిఇఇ ఆర్.శేఖర్ తదితరులు ఉన్నారు.



## జోరు వాన: వాడలు జలమయం

**శ్రీకాళహస్తి, అక్టోబర్ 16 ప్రభాతవార్త**

శ్రీకాళహస్తి పట్టణంలోని పలు వార్డుల్లో వర్షపు నీరు నిండింది. కాలువలు ఉప్పొంగి అతలాకుతలం చేస్తుంది. మున్సిపల్ పరిధిలోని మురుగునీటి కాలువలను అక్రమించుకొని నిర్మాణాలు చేపట్టడంతో మురుగు నీరు, వర్షపు నీరు వెళ్ళటానికి ఆటంకంగా మారింది. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో వార్డుల్లో పరిస్థితిని పట్టణ పార్టీ అధ్యక్షుడు జి.విజయకుమార్‌నాయుడు పర్యటించి పరిశీలించారు. ఓటేరు కాలువ, ముత్యాలమ్మగుడివీధి, సంతమైదానం, ఎస్‌డికె నగర్, స్వర్ణముఖి పరిసరాలు, 28వ వార్డుల్లో విస్తృతంగా పర్యటించి పరిస్థితిని సమీక్షించారు. శ్రీకాళహస్తి పట్టణంలో 9 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి సహాయక చేపట్టారని వివరించారు. మోకాలిలోతు నీటిలోనే విజయకుమార్ నా యుడు పర్యటించి సమస్యలను గుర్తించి శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి దృష్టికి తెచ్చారు. ఆయన వెంటనే స్పందించి చెంచులక్ష్మీకాలనీలో కమిషనర్ బియస్ గిరికుమార్‌తో పర్యటించి ప్రజలకు భరోసా ఇచ్చారని వివరించారు.

## ఇది చెరువా?రోడ్డా!

**శ్రీకాళహస్తి రూరల్, అక్టోబర్ 16 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తి మండలంలోని పలు గ్రామాలకు సంబంధించిన రహదారులు చెరువులను మరిపిస్తున్నాయి. ముఖ్యంగా ప్రధాన పంచాయతీలున్న గ్రామాల పరిస్థితి అధ్వాన్నంగా మారింది. గత ఐదేళ్ళలో పంచా యతీలకు సంబంధించి పాలకులు పట్టించుకోక పోవటంతో పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. గత రెండు రోజులుగా కురుస్తున్నఎడతెరపి లేని వానలతో గ్రామాలకు రాకపోకలు ఇబ్బందిగా మారింది. చక్క టి సిమెంటు రోడ్ల పక్కన కాలువల్లేనందువల్ల నీరు నిలుస్తుంది. అయితే నీరు నిల్వ అయిన రోడ్లపై పరిస్థితి ఏమిటో అర్థం కాక పాదచారులు, వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో శ్రీకాళహస్తిమండలంలోని తొండమనాడు గ్రామానికి వెళ్ళు రోడ్డుపై నీరు నిలిచి ప్రజలు ఇబ్బందులుఎదుర్కొంటున్నారు.

## ధూప దీప నైవేద్యాలకు దిక్కులేని రోజుల్లో స్థానికులే . . .

**బిజెపి పట్టణ అధ్యక్షుడు**

**శ్రీకాళహస్తి, అక్టోబర్ 16 ప్రభాతవార్త**

శ్రీకాళహస్తీశ్వరునికి ధూప దీప నైవేద్యాలకు ఆర్థికంగా లేనపుడు స్థానికులే దీపం వెలిగించారని నేడు కొత్త నిబంధనలతో స్థానికులను శివయ్యకు దూరం చేయవద్దని భారతీయ జనతాపార్టీ అధ్యక్షుడు గరికపాటి రమేష్‌బాబు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్ ఎస్ చంద్రశేఖర్ ఆజాద్‌కు వినతి పత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ 1960లో ఆలయానికి ఆదాయ మార్గాలుండేవి కాదన్నారు. భక్తుల సంఖ్య కూడా ఉండేది కాదన్నారు. మిరాసి దారులు పట్టణంలోని పలువురిని అభ్యర్థించి నిత్య పూజలు జరిపే వారని వివరించారు. స్థానికుల భాగస్వామ్యంతో విరాళాలతో స్వామి అమ్మవార్లకు నిత్యపూజలు, ఉత్సవాలను నిర్వహించే వారన్నారు. దాంతో ఆలయంలో ఆర్చనాలతో, పూజలతో దీపారాధనలతో, హోమాలతో అభిషేకాలతో స్వామి అమ్మవార్ల ఆలయాలు కళ కళ లాడేదన్నారు. 1994లో రాహుకేతుదోష నివారణ పూజలు ప్రారంభమైనప్పటి నుంచి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ఆకర్షితులై తాకిడి పెరిగిందన్నారు. అప్పటి నుంచి రోజు రోజుకు నిబంధనల ఉచ్చు బిగుస్తున్నారన్నారు. నేడుపాలకులు, అధికారులు స్థానికులకు శివయ్యదర్శనం దూరం చేయటం తగదన్నారు. మనూరు, మన గుడి అని భావించిన భక్తులను శివయ్య నుంచి దూరం చేయటానికి అధికారులు ప్రయత్నించటం దారుణమని వివరించారు. సమయ పాలనను ఎవ్వరూ తప్పుపట్టడం లేదు. కానీ ఆధార్‌కార్డు, పిఆర్‌ఓ కార్యాలయం అంటూ ఆంక్షలు విధించటం దారుణమన్నారు. నిబంధనలను పక్కన పెట్టి స్థానికులకు యథావిధిగా దర్శనాలకు అనుమతించాలన్నారు.

## ఎస్టీ కాలనీ వాసులకు భోజన ప్యాకెట్లు పంపిణీ

**తొట్టంబేడు, అక్టోబర్ 16 ప్రభాతవార్త**



గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని పొయ్య పంచాయతీ రామానాయుడు ఎస్టీ కాలనీలో నివాసం ఉంటున్న వారికి మండల ఎంపిపి ఉన్నం నిర్మల వాసుదేవనాయుడు ఆధ్వర్యంలో భోజన ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఎలాంటి ఇబ్బందులు ఉన్నా వెంటనే తనకు పోన్‌చేయాలని వైకాపా సీనియర్‌నాయకులు ఉన్నం వాసుదేవనాయుడు కాలనీ వాసులకు సూచించారు. సుమారు 150మంది కాలనీవాసులకు భోజనప్యాకెట్లు కాకుండా వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

## పునరావాస కేంద్రాలకు ప్రజల తరలింపు

**శ్రీకాళహస్తి, అక్టోబర్ 16 ప్రభాతవార్త**



రెండు రోజుల పాటు భారీ వర్షాలు ఉంటాయని వాతావరణశాఖ అధికారులకు తెలియజేయడంతో శ్రీకాళహస్తిలోని అధికారులు అప్రమత్తమయ్యారు. పట్టణంలోని పలు లోతట్టు ప్రాంతాల్లో పర్యటిస్తూ అక్కడి ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు. పురపాలక సంఘ కమిషనర్ బిఎస్. గిరికుమార్ పలు ప్రదేశాలల్లో పర్యటిస్తూ వర్షం నీటిలో ఉంటున్న గృహాలను గుర్తించి అక్కడ ఉంటున్న వారిని వెంటనే ఏరియా ఆస్పత్రి ఎదురుగా ఉన్న ఇంటిగ్రేటెడ్ వసతిగృహంకు తరలించారు. ఇక్కడ వారికి కావాల్సిన వైద్యసదుపాయాలతో పాటు భోజన వసతిలు కల్పించేవిధంగా చర్యలుతీసుకుంటున్నట్లు వివరించారు. సహాయక చర్యలకోసం 9000060797 టోల్‌ఫ్రీ నంబర్‌కు పోన్‌చేయాలని కమిషనర్ పేర్కొన్నారు.

## 20న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌చే భాక్సింగ్, చెస్ టీములు ఎంపిక

**తిరుపతి క్రీడ, అక్టోబర్ 16, ప్రభాతవార్త** ఉమ్మడి చిత్తూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ 19 ఆధ్వర్యంలో భాక్సింగ్, చెస్ చిత్తూరు జిల్లా టీములను ఈ నెల 20వ తేది నిర్వహిస్తున్నట్లు సెక్రటరీ జయరామయ్య తెలిపారు. 20వ తేది ఉదయం 9 గంటలకు తిరుచానూరు జడ్పి హైస్కూల్‌లో భాక్సింగ్ ఎంపికలు, ఉదయం 9.30కు బైరాగిపట్టెడ తిరుపతి ఎంజిఎం హైస్కూల్ నందు చెస్ పోటీలకు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సెలెక్షన్‌కు హాజరైయ్యే విద్యార్థిని విద్యార్థులు 9,10, ఇంటర్మీడియట్ చదువుతున్న బాలబాలికలు మాత్రమే అర్హులు, పదవ తరగతి మార్కులిస్టు, స్టడీ సర్టిఫికేట్, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలు తీసుకురావాలని తెలిపారు.

## మార్కెట్లోకి టొయోటా కిర్లోస్కర్ మోటార్

**తిరుపతి విద్య, అక్టోబర్ 16 ప్రభాతవార్త:**

పండుగ ఉత్సాహానికి మరింత సంతోషం జోడిస్తూ, టొయోటా కిర్లోస్కర్ మోటార్(టికెఎం) బుదవారం తమ అత్యంత ప్రజాదరణ పొందిన మోడల్ -అర్బన్ క్రూయిజర్ టైజర్ యొక్క లిమిటెడ్ ఎడిషన్‌ను విడుదల చేసినట్లు ప్రకటించింది. ఈ ప్రత్యేక ఎడిషన్, స్టైల్, ప్రీమియం-నెస్‌ని మెరుగుపరచడంపై దృష్టి సారించి రూపొందించబడింది. కస్టమర్‌లకు మరింత ఆనందం ఇస్తూ ఈ పరిమిత ఎడిషన్ రూ.20,160 విలువ కలిగిన టొయోటా జెన్యూన్ యాక్సెసరీస్(టిజిఏ) ప్యాకేజీతో వచ్చింది అని అన్నారు. టొయోటా కిర్లోస్కర్ మోటార్, సేల్స్ శ్రీసర్వీస్-యూజ్డ్ కార్ బిజినెస్ వైస్ ప్రెసిడెంట్ శబరి మనోహర్ మాట్లాడుతూ టొయోటా వద్ద మా ప్రయత్నాలు ఎల్లప్పుడూ మా కస్టమర్ల ప్రత్యేకత వేడుకలో భాగం కావడంపైనే కేంద్రీకృతమై ఉన్నాయి అని, అర్బన్ క్రూయిజర్ హైరైడర్ ఫెస్టివ్ ఎడిషన్‌ను ఇటీవలే పరిచయం చేసిన తర్వాత, ఈ పండుగ సీజన్ కోసం తాజా మరియు ఉత్తేజకరమైన జోడింపులు చేస్తూ అర్బన్ క్రూయిజర్ టైజర్ ఫెస్టివ్ ఎడిషన్‌ను అందించడానికి మేము సంతోషిస్తున్నాము అని అన్నారు.

## చెరువులకు ఇబ్బందిలేదు..ఇరిగేషన్ ఎఈ

**శ్రీకాళహస్తి, అక్టోబర్ 16 ప్రభాతవార్త**

మండలంలోని చెరువులన్నీ గట్టిభద్రతా ఏర్పాట్లు ఉన్నాయని ఇరిగేషన్ ఎఈ రాఘవేంద్ర తెలిపారు. ఈసందర్భంగా గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు తుఫాను ప్రభావంతో అధికారుల సమన్వయంతో ఇరిగేషన్‌శాఖ ఆధ్వర్యంలో చెరువులను పర్యవేక్షి స్తున్నారు. ఈసందర్భంగా ఇరిగేషన్ ఎఈఈ రాఘవేంద్ర మాట్లాడుతూ మండలంలో మొత్తం 131చెరు వులు ఉన్నాయని మేజర్ చెరువులుగా తొండమనాడు చెరువు 4,600 ఎకరాలకు సాగునీరు, ఊరందూరు చెరువు 964 ఎకరాలకు సాగునీరు, ముచ్చివోలు చెరువు 694 ఎకరాలకు సాగునీరు అందిస్తాయని, 129 చెరువులు మైనర్ ఇరిగేషన్‌లో ఉన్నాయన్నారు. తుఫాను ప్రభావంతో బుధవారంపలు చెరువులను పరిశీలించారు. కలెక్టర్, ఆర్డీవో, ఇరిగేషన్ ఈఈ మదనగోపాల్. డిఈఈ ఆదినారాయణ, ప్రకాష్‌రావుల ఆదేశాల మేరకు ఎఈఈలు రాఘవేంద్రలతో పాటు నాగరాజు, మునిమోహన్‌లు పాల్గొన్నారు.

## లోతట్టు ప్రాంతాలను పరిశీలించిన కమిషనర్ ఎన్. మౌర్య



**తిరుపతి కార్పొరేషన్, అక్టోబర్ 16, ప్రభాతవార్త** తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలతో నగర పాలక సంస్థ పరిధిలోని లోతట్టు ప్రాంతాలైన కొరమేనుగుంట, గొల్లవాణిగుంట, ఆటోనగర్, తదితర ప్రాంతాల్లో అధికా రులతో కలిసి కమిషనర్ ఎన్ మౌర్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె ప్రజలతో మాట్లాడి వారి పరిస్థితిలను అడిగి తెలుసుకున్నారు. కొరమేనుగుంటకు నీరు ఎక్కువగా వచ్చి చేరుతూ ఉండడంతో పరిసర ప్రాంతాల్లో ఉన్న ప్రజలని ఖాళీ చేయించి పునరావాస కేంద్రాలను తరలించే చర్యలు చేపడుతున్నారు. అలాగే నగరంలో నీరు చేరిన కూడళ్లలో, అండర్ బ్రిడ్జిల వద్ద మోటార్లతో నీరు తోడి వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపడుతున్నారు.

## ఎడతెరిపిలేని వర్షం .. స్తంభించిన ప్రజాజీవనం

**బాలాయపల్లి, అక్టోబర్ 16, ప్రభాతవార్త** తుఫాను కారణంగా మండలంలో భారీ వర్షం పడింది. వర్షానికి నేరేడు వాగు, కైవల్య నది పొంగి ప్రవహించాయి. మూడు రోజులు నుండి ఎడతెరిపి లేకుండా వర్షాలు పడుతున్నందున ప్రజాజీవనం స్తంభించింది. నిండలి గ్రామం వద్ద కైవల్య నది కాజువేపై పొంగి ప్రవహించడంతోవాహనాల రాకపోకలు స్తంభించాయి. విస్తారంగా వర్షాలు పడడంతో పంటలు సాగు చేసుకోవచ్చని రైతులు హర్షించారు.

## యువకుడు ఆత్మహత్య

**కుప్పం, అక్టోబర్ 16 ప్రభాతవార్త** కుప్పం పట్టణం ప్రగతి స్కూల్ సమీపంలో గల ఓ ఇంట్లో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా.. ప్రగతి స్కూల్ సమీపంలో మన్సూర్ తన కుమారులతో కలిసి కాపురం ఉంటున్నాడు. భార్య ఇటీవల మృతి చెందింది. పొట్ట కూటి కోసం మన్సూర్ అతని మరో కుమారుడు బయటి ప్రాంతాలకు వెళ్లారు. ఈ నేపథ్యంలో బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో మన్సూర్ కుమారుడు చాన్‌బాషా (23) ఇంట్లో ఫ్యానుకు చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇది గమనించిన పక్కింటివారు పోలీసులకుసమాచారంఅందించారు. యువకుడి మృతికి గల కారణాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది

## పారిశుద్ధ్య కార్మికుల సేవలకు ప్రణామం

**టిడిపి జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి మునిరత్నం రాయల్**

**చంద్రగిరి, అక్టోబర్ 16 ప్రభాతవార్త:**



పంచాయతీ కార్మికులు అందిస్తున్న సేవలకు టిడిపి జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి మునిరత్నం రాయల్ ప్రణామాలు తెలిపారు. టిడిపి మండల అధ్యక్షుడు పల్లినేని సుబ్రమణ్యం నాయుడు సహకారంతో బుధవారం ఆయన పంచాయతీ కార్మికులకు రెయిన్ కోట్లు వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజారోగ్యం కోసం పంచాయతీ కార్మికులు నిరంతర సేవలు ప్రశంసనీయమన్నారు. సర్పంచ్ ముద్దికుప్పం రూపరామమూర్తి మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల పట్ల పల్లినేని సుబ్రమణ్యం నాయుడు, మునిరత్నం రాయల్ సేవానిరతికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుత తుఫాన్ తీవ్రత నేపథ్యంలో కార్మికులకు రెయిన్ కోట్లు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓ మహేశ్వరయ్య, కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఫార్మశీ రంగంలో యువతదే కీలకపాత్ర

**డాక్టర్ ఉమామహేశ్వర్ రావు**

**రామచంద్రాపురం, అక్టోబర్ 16 ప్రభాతవార్త:**



ఫార్మశీ రంగంలో యువత పాత్ర ఎంతో కీలకమని శ్రీ పద్మావతీ మహిళా మెడికల్ కళాశాల ఫార్మా కాలేజీ విభాగాధిపతి డాక్టర్ ఉమామహేశ్వర్ రావు అన్నారు. బుధవారం వెంకట్రామాపురం సమీపంలోని సెవెన్ హిల్స్ ఫార్మశీ కళాశాలలో పట్టభద్రులు దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నిరంజన్ బాబుతో కలసి జ్యోతి ప్రజ్వలన గావించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు నైతిక విలువలతో పాటు సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. భవిష్యత్ టెక్నాలజీపైనే ఆధారపడి కొనసాగుతుందన్నారు. విద్యార్థులకు ఫార్మారంగంలో ఉపాధి అవకాశాలు మెండుగా వున్నాయన్నారు. వివిధ విభాగాలలో ప్రతిభ కనబరిచిన వారికి నగదు ప్రోత్సాహకాలతో పాటు ఫార్మ డి విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ పట్టాలు అందజేశారు. పుత్తూరు వేదనారాయణ విద్యా సంస్థల అధినేత డాక్టక్ దినకర్ బాబు, సెవెన్‌హిల్స్ ఫార్మశీ కళాశాల కరస్పాండెంట్ సుమలత, అధ్యాపకులు, సిబ్బంది, పాల్గొన్నారు.

## భారీ వర్షాలు అధికారులు తస్మాత్ జాగ్రత్త

**ఎంపిపి మావిళిరెడ్డిగారి హేమేంద్రకుమార్ రెడ్డి**

**చంద్రగిరి, అక్టోబర్ 16 ప్రభాతవార్త:**



బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా కురుస్తున్న భారీ వర్షాల పట్ల అధికారులు, ప్రజా ప్రతినిధులు జాగ్రత్తగా వ్యవహరించాలని ఎంపిపి మావిళిరెడ్డిగారి హేమేంద్రకుమార్ రెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు, కాలనీలలో వరద ముప్పు ప్రాంతాలను పరిశీలించి, గత అనుభవాలతో ముందస్తు జాగ్రత్తలను తీసుకోవాలని సూచించారు. పల్లెపండుగ కార్యక్రమంలో మొదటి విడతలో 7 పంచాయతీలను ఎంపిక చేసినట్లు వివరించారు. సుమారు రూ.2 కోట్లకు పైగా నిధులను ఈ పంచాయతీలలో మురుగునీటి కాలువలు, పాడైన రోడ్లు మరమత్తులకు ఉపయోగించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శివరామసుబ్బయ్య, ఇన్‌చార్జ్ శేఖర్, కో అప్షన్ సభ్యుడు ఔరంగజేబు, ఎంపిటిసిలు బుల్లెట్ చంద్రమౌళి రెడ్డి, మాదవరెడ్డి, రాజయ్య, బోస్ చంద్రారెడ్డి, సర్పంచ్‌లు అగరాల భాస్కర్ రెడ్డి, వెంకటయ్య, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## టీటీడీ బోర్డు మెంబరుగా వెంకటాద్రి యాదవ్‌కు అవకాశం ఇవ్వండి

**రేణిగుంట, అక్టోబరు 16 ప్రభాతవార్త:**



బీజేపీ యువనేత, యాదవ సంఘం నాయకులు, విద్యార్థి సంఘం నేత వెంకటాద్రి యాదవ్‌కు టీటీడీ బోర్డు మెంబరుగా అవకాశం కల్పించాలని ఆంధ్రప్రదేశ్ యువజన సంఘం విద్యార్థులు డిమాండ్ చేశారు. హిందూ ధర్మానికి సంబంధించి అనేక కార్యక్రమాలు నిర్వహించారన్నారు. గోమాత గొప్పతనాన్ని అందరికి వివరిస్తున్నారన్నారు. సనాతన ధర్మం పట్ల ఎంతో ఆసక్తి కనబరుస్తారన్నారు. దేవదేవుడైన శ్రీ వెంకటేశ్వర స్వామి పట్ల అపారమైన భక్తిశ్రద్ధలు ఉన్నాయన్నారు. యువత చెడుదోవ పట్టకుండా గ్రామంలో మాలధారణ, భజనలు తదితర కార్యక్రమాలు నిర్వహిస్తూ యువతను భక్తి మార్గం వైపు పయనింప చేస్తున్నారన్నారు. ఆధ్యాత్మిక భావన కలిగిన వెంకటాద్రి యాదవ్‌కు టీటీడీ బోర్డు మెంబరుగా అవకాశం కల్పించాలని కోరారు.

## శిక్షణ తరగతులు కొందరికే

**రేణిగుంట, అక్టోబరు 16 ప్రభాతవార్త:**

రేణిగుంట మండలంలోని పంచాయతీల ఉప సర్పంచ్, వార్డు మెంబర్లకు జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పంచాయతీ పరిపాలన విధానాలపై రెండు రోజులు నిర్వహించిన శిక్షణ తరగతులకు కొందరికి మాత్రమే పిలుపులు వెళ్లాయని మరి కొంత మందిని ఆహ్వానించలేదని కొందరు వార్డు మెంబర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిని వారు దుర్మార్గపు చర్యగా అభివర్ణిస్తున్నారు. అయిన వాళ్ళకు ఆకుల్లో, కానీ వారికి కంచాల్లో అన్న చందాన పంచాయతీ అధికారులు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ అధికారులు అవలంబిస్తున్న తీరును ఖండిస్తున్నామన్నారు. ఈ విషయమై ఎంపీడీవో విష్ణు చిరంజీవిని వివరణ కోరగా అందరిని ఆహ్వానించామని తెలిపారు. కార్యదర్శి మణి వివరణ ఇస్తూ జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మొదటి విడతగా 50 మందికి శిక్షణ ఇస్తున్నామని, ఉన్నతాధికారుల నిర్ణయం మేరకు విడతల వారీగా తరగతులు నిర్వహిస్తామని తెలిపారు.

## ముంపు ప్రాంతాలలో పర్యటించిన ఎమ్మెల్యే పులివర్తి నాని

**-పునరావాస కేంద్రాలు పరిశీలన...ముంపు బాధితులకు దుప్పట్లు**

**-అధికారులు, పార్టీ కార్యాకర్తలు సహాయ చర్యల్లో పాల్గొనాలని సూచన**

**తిరుపతిరూరల్, అక్టోబర్ 16 ప్రభాతవార్త:** బంగాళఖాతంలో అల్పపీడనం కారణంగా గత రెండురోజులుగా జిల్లా వ్యాప్తంగా వర్షాలు విరివిగా కురుస్తున్న నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరాసవాస కేంద్రాలకు తరలించి అధికారులు తగిన సహాయ చర్యలు చేపడుతున్న విషయం తెల్సిందే. బుధవారం చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని తిరుపతిరూరల్ మండల పరిధిలోని లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు. మంగళం పరిధిలోని సప్తగిరి కాలనీ, డ్రైవర్స్ కాలనీలలో పర్యటించి, పునరావాసన కేంద్రాలలో ఉన్న బాధితులకు దుప్పట్లు, ఆహార సదుపాయాలు ఏర్పాటు చేసారు. అధికారులు, పార్టీ కార్యకర్తలు ముంపుబాధితులకు అందుబాటులో ఉండి సహాయ చర్యలలో పాల్గొనాలని సూచించారు. గాంధీపురంలో ఇండ్లలోకి నీరు రావడంతో వాటిని తోడించటానికి చర్యలు చేపట్టారు. అలాగే తిరుచానూరు, యోగిమల్లవరం తదితర ప్రాంతాలను ఎమ్మెల్యే పులివర్తి పర్యటించి, బాధితులకు సహాయ చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్థార్ రామాంజుల నాయక్, ఎంపిడిఓ రామచంద్ర, పార్టీనేతలుఅలిమినేని మధు, తిరుచానూరు కిశోర్‌రెడ్డి, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

## వరదనీటిలో మునిగిన ముళ్ళపూడి గిరిజన కాలనీ

**శ్రీకాళహస్తిరూరల్, అక్టోబర్ 16 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తి మండలం మూడురోజులుగా కురుస్తున్న బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడనంతో పలు గ్రామాలు జలమయమయ్యాయి. బుధవారం ఉద యం కుండపోత వర్షంతో పలు కాలనీలు జలమ యమయ్యాయి. శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి స్వగ్రామం ఊరందూరుకు కూత వేటు దూరంలోని ముళ్ళపూడి గిరిజన కాలనీ ఉంది. ఈ కాలనీకి వెళ్ళాలంటే సున్నపు కాలువను దాటుకొని పోవాలి. నారాయణ పురం పంచాయతీ పరిదిలోని ముళ్ళపూడి గిరిజన కాలనీ ఎంతో కాలంగా సమస్యల వలయంగా మారింది. ఈ కాలనీలో గిరిజనులు నివాసముంటున్నారు. ఇక్కడ సుమారు 50కుటుంబాలు నివాసముంటున్నాయి. ఇక్కడ కనీసం రోడ్లు కాదు కాదా కనీసం మురుగునీటి కాలువలు లేవు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ముళ్ళపూడి కాలనీలోని ఇళ్ళలోకి నీరు చేరింది. దాంతో నిరుపేదలైన గిరిజనులకు రోజు గడవటం కష్టంగా మారింది. అయితే ప్రజలే వర్షపు నీటిని తొలగించుటకు ప్రయత్నించారు. ఈ కాలనీని బుధవారం సిపిఐ నాయకుడు గురవయ్య తమ పార్టీ వారితో కలసి పర్యటించారు. పరిస్తితిని ఆర్‌డిఓ భానుప్రకాష్‌కు వివరించారు. ఈ కాలనీ వాసులకు కనీసం భోజన సదుపాయం కల్పించాలని కోరారు. కాగా శ్రీకాళహస్తి మండలంలోని శ్రీకాళహస్తి-ముచ్చివోలు మార్గంలో రోడ్డు భారీ వర్షాలతో దెబ్బతిన్నది. ఈ రోడ్డును ఆర్‌డిఓ స్వయంగా వెళ్ళి పరిశీలించారు. కాగా శ్రీకాళహస్తి-వేడాం రోడ్డు పరిస్థితి అధ్వానంగా మారింది.

**ఆర్‌డిఓ, పోలీసులు పరుగులు:**

శ్రీకాళహస్తి మండలంలోని ముళ్ళపూడి గిరిజన కాలనీలో సమస్యలపై సమాచారం అందిన వెంటనే ఆర్‌డిఓ భాను ప్రకాష్‌రెడ్డి, సిఐ రవినాయక్, తహశీల్దార్లతో ముళ్ళపూడి గిరిజన కాలనీకి పరుగులు తీసారు. ప్రభుత్వ యంత్రాగాన్ని అప్రమత్తం చేసారు. జెసిబిలతో గ్రామంలో వెళ్ళి నీటిని మళ్ళించారు. దాంతో గిరిజనులు ఊపిరి పీల్చుకున్నారు. పరిస్థితి సమీక్షించి నిత్యావసర సరకులను అందిస్తామని భరోసా ఇచ్చారు. వర్షాలతో మండలంలోని శ్రీకాళహస్తి-ముచ్చివోలు, శ్రీకాళహస్తి-ఊరందూరు, శ్రీకాళహస్తి-వేడాం రోడ్లు ధ్వంసం అయ్యాయి.

## అందుబాటులో ఇసుజు డి-మ్యాక్స్ అంబులెన్స్

**తిరుపతి విద్య, అక్టోబర్ 16 ప్రభాతవార్త:** ఇసుజు మోటార్స్ ఇండియా ఏఐఎస్ 125 టైప్ అంబులెన్స్ నిర్దేశనలతో రూపొందించిన ఇసుజు డి మ్యాక్స్ అంబులెన్స్‌ను మార్కెట్లోకి విడుదల చేసినట్లు ఆ సంస్థ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ తోరు కిషిమటొ తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ పట్టణ, గ్రామీణ ప్రాంతాల రహదారులకు అనుగుణంగా తమ కొత్త అంబులెన్స్ ఏర్పాటు చేశామన్నారు. ఇందులో సరికొత్త పరిజ్ఞానంతో కూడిన పరికరాలతో పాటు రోగికి అవసరమైన సరికొత్త సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన సౌకర్యాలు ఏర్పాటు చేశామని తెలిపారు. దీనిని రోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరింత సమాచారం కోసం వినియోగదారుడు 18004199188(టోల్ ఫ్రీ)ను సంప్రదించాలని కోరారు.

# తిరుపతి డివిజన్

## పొంగి పొర్లుతున్న వాగులు వంకలు

**ధ్వంసమైన రోడ్లు: నియోజకవర్గంలో ఎంఎల్ఏ పర్యటన**

**శ్రీకాళహస్తి, అక్టోబర్ 16 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తి నియోజకవర్గంలో రెండు రోజులుగా బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్ప పీడనంతో ఎడతెరిపి లేని వర్షం కురుస్తుంది. మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం ఉదయం నుంచి కుండపోతగా వర్షం కురుస్తుంది. ఈ ప్రాంతంలో అక్టోబర్ నెల సాధారణ సగటు వర్షపాతం 229 మి.మీలు కాగా బుధవారం సాయంత్రం వరకు అందిన సమాచారం మేరకు 238 మి.మీల వర్ష పాతం నమోదైంది. ఒక్కరోజులోనే 152 మి.మీల వర్షపాతం నమోదైంది. శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని శ్రీకాళహస్తిలో సాధారణ సగటు వర్షపాతం కన్నా 9 మి.మిలు అధికంగా నయోదైంది. అలాగే ఏర్పేడులో సాధారణ సగటు వర్షపాతం 212.4 మీ.మిలు కాగా 252 మి.మీలు, తొట్టంబేడు మండలంలో సాధారణ సగటు వర్షపాతం 223.9 మి.మీలు కాగా 208 మి.మీలు రేణిగుంట సాధారణ సగటు వర్షపాతం 167.3 మి.మీలు కాగా 183 మి.మీలు నమోదైంది. అంటే అక్టోబర్ సాధరణ సగటు వర్షపాతం కన్నా అధికంగా నమోదైంది.

**ఓ వైపు అధికారులు, మరో వైపు నాయకుల పరుగులు:**

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో తుఫాను వర్షంతో ఓ వైపు అధికారులు పరుగులు తీయగా మరో వైపు కుండపోత వర్షంలో కూడా లెక్క చేయక శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి, ఆయన సహచరులు గ్రామాల వైపు పరుగులు తీసారు. ఉదయం నుంచి శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి విస్తృతంగా పర్యటించారు. పరిస్థితి పరిశీలించారు. ఏర్పేడు మండలంలోని మోదుగుల పాళెం కు వెళ్ళు మార్గంలో స్వర్ణముఖి నదికి వరద వస్తుండటంతో ఎంఎల్ఏ సుధీర్‌రెడ్డి పరిశీలించారు. అధికారులతో సమీక్షించారు. కాగా ఇరిగేషన్ ఇఇ మదనగోపాల్‌తో నియోజకవర్గంలోని చెరువులకు సంబంధించి ఎంఎల్ఏ చర్చించారు. నియోజకవర్గంలో వ్యవసాయం చెరువుల మీద ఆధార పడిఉందన్నారు. కాబట్టి వర్షపు చుక్క బయటకు పోకుండా కాపాడాలని సూచించారు. కాగా పట్టణంలోని పలు లోతట్టు ప్రాంతాలలో పర్యటించారు. చెంచులక్ష్మీ కాలనీలో నీరు చేరటంతో ప్రజలు అవస్థలు పడుతుండటంతో కమిషనర్ బి.యస్ గిరి కుమార్‌ను రప్పించి ప్రత్యేకంగా జెసిబిలు ఏర్పాటు చేసి నీటిని తొలగించారు. శ్రీకాళహస్తి ఆర్‌డిఓ భానుప్రకాష్‌రెడ్డి, మండలాల్లోని తహశీల్దార్లు, ఎంపిడిఓలు, మున్సిపల్ కమిషనర్‌తో గంట గంటకు పరిస్థితిపై సమీక్షించారు. బుధవారం సాయంత్రం వరకు ఎలాంటి ఆస్తి నష్టం లేదని అధికారులు ఎంఎల్ఏ దృష్టికి తెచ్చారు. స్వర్ణముఖి పారుతుందని చెరువుల్లోకి నీరు చేరుతుందని అధికారులు వివరించారు.

## జాతీయ స్థాయిలో ప్రతిభ చూపిన క్రీడాకారులకు మాజీ మంత్రి ప్రశంస

**నగరి, అక్టోబరు 16 ప్రభాతవార్త:**



సబ్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ క్రీడలో జాతీయ స్థాయిలో ప్రతిభ చూపి స్టార్ ఆఫ్ ఇండియా సాధించిన క్రీడాకారుడు కె.సి.తేజేష్‌ను రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరచి బెస్ట్ అప్ కమింగ్ ప్లేయర్ అవార్డు సాధించిన లక్ష్మీనరసింహారెడ్డిని, సబ్ జూనియర్, జూనియర్ రాష్ట్ర స్థాయి పోటీలో ప్రతిభకనబరచిన భానుప్రకాష్, ఇజాజ్, రిత్విక్, సిద్ధిక్‌లను మాజీ మంత్రి రోజా ప్రశంసించారు. బుధవారం తన స్వగృహానికి క్రీడాకారులను రప్పించిన ఆమె జాతీయ స్థాయిలో ప్రతిభ చాటినందుకు వారిని అభినందించారు. నాలుగేళ్ళ క్రితం క్రీడాకారులందరిని మాజీ మంత్రి రోజా తన చారిటబుల్ ట్రస్టు ద్వారా ఖర్చులన్ని భరించి జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడలకు పంపించారని అప్పటి నుంచి ప్రతి పోటీలోను తమ పిల్లలను ప్రతిభకనబరచి పతకాలు సాధిస్తున్నారని క్రీడాకారుల తల్లిదండ్రులు మాజీ మంత్రి రోజాకు కృతజ్ఞతలు తెలిపారు.

## కేవీబీ పురంలో ఎడతెరపి లేని వర్షం

**కేవీబీ పురం, అక్టోబరు 16 ప్రభాతవార్త:**

మండలంలో ఎడతెరపి లేని వర్షం కురవడంతో బుధవారం జన జీవనం పూర్తిగా స్తంభించింది. రంగయ్యగుంట, పూడి కాజ్‌వేను కేవీబీ పురం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు రామాంజుల నాయుడు, తిరుపతి పార్లమెంట్ రైతు అధ్యక్షుడు కనపర్తి గోపినాథ్‌రెడ్డి, యువత అధికార ప్రతినిధి అవసరం సురేష్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సుకుమార్, నాగరాజురెడ్డి, ఇరిగేషన్ అధికారులు బాబు, ఉదయ్, తహసీల్దార్ మునిరత్నం, వీఆర్‌వోలు, సెక్రటరీ, గ్రామ ప్రజలు మండలంలో కేవీబీ పురం కొవనూరు, తిమ్మసముద్రం, ఎగువపూడి గ్రామాల్లో పర్యటించారు. అలాగే కోవనూరు వద్ద ఉధృతిని పరిరక్షించారు.

## నగరి క్లస్టర్ డ్వామా ఏపిడిగా సునీల్‌కుమార్

**నింద్ర, అక్టోబరు 16 ప్రభాతవార్త :**



నగరి క్లస్టర్ డ్వామా ఎపిడిగా బి.సునిల్‌కుమార్ బుదవారం బాధ్యతలు స్వీకరించినారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఎపిడి శోభన్‌బాబు తిరుపతి జిల్లా డిఆర్‌డిఏ ప్రాజెక్టు డైరెక్టర్‌గా పదోన్నతిపై వెళ్ళారు. ఈనేపథ్యంలో చిత్తూరు డ్వామా కార్యాలయంలో ఏపిడిసిబిగా పనిచేస్తున్న సునిల్ కుమార్‌ని నగరి క్లస్టర్ డ్వామా ఏపిడిగా అదనపు బాధ్యతలు అప్పగిస్తు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసారు. ఈ మేరకు బుదవారం పదవీ బాధ్యతలు స్వీకరించినారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తన క్లస్టర్ పరిదిలో పనులు వేగవంతంగా జరగడానికి అన్ని చర్యలు తీసుకుంటానని తెలిపారు.

## వరద బాధితులకు ఆర్థిక సాయం

**పుత్తూరు, అక్టోబరు 16 ప్రభాతవార్త :**



విజయవాడలోని వరద బాధితులకు స్టార్క్ కంటైనర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ యాజమాన్యం తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయ్‌బాబు ద్వారా ఒక లక్ష రూపాయల ఆర్థిక సాయం అందించింది. చిత్తూరు జిల్లాలోని గుడిపాల మండలంలో వున్న ఈ కంపెనీ అందించిన ఒక లక్ష రూపాయల చెక్కును బుధవారం విజయ్‌బాబు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెమనాయుడుకు అందించారు. తాను అడిగిన వెంటనే వరద బాధితులకు సహాయం చేయడానికి ముందుకు వచ్చిన స్టార్క్ కంపెనీ యాజమాన్యానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## సిమెంటు రోడ్డుకు భూమిపూజ

**విజయపురం, అక్టోబరు 16 ప్రభాతవార్త:**



మండలంలోని సామిరెడ్డి కండ్రిగ, మల్లారెడ్డి కండ్రిగ పంచాయతీల్లో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా బుధవారం సీసీరోడ్డునిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## లో తట్టు ప్రాంతాలు జలమయం

**కేవీబీ పురం, అక్టోబరు 16 ప్రభాతవార్త:**



బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రెండు రోజుల పాటు మండలంలో ఎడ తెరపి లేని వర్షం కురుస్తోంది. ఈ వర్షంతో లో తట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మండలంలోని ఎగువపూడి కాజ్‌వే, తిమ్మసముద్రం కాజ్‌వే, కోవనూరు వాగులు, వంకలు వద్ద ప్రవాహం ఉధృతమైంది. నివాస ప్రాంతాల్లో అంతర్గత రోడ్లు బురదమయంగా మారి, అక్కడక్కడ గుంటల్లా వర్షపునీరు చేరింది. దీంతో స్థానికులకు ఇబ్బందిగా మారింది.

## తుఫాను వరద బాధితులను ఆదుకోవాలి

**పుత్తూరురూరల్, అక్టోబరు 16 ప్రభాతవార్త:**

పుత్తూరు మండలంలోని, మున్సిపాలిటీలో ఉన్నటువంటి రెండు రోజులుగా తుఫాను ఎక్కువగా ఉండడం వలన వార్డుల్లో, గ్రామాల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వారి సమస్యలు వెంటనే పరిష్కరించాలని వరద బాధితులు ఆదుకోవాలనిసీపీఎం కార్యదర్శి వెంకటేష్ తహసీల్దార్‌కి వినతిపత్రం అందజేశారు. రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్న లో తట్టు ప్రాంతంలో ఉన్నటువంటి వారికి బియ్యం, నిత్యావసర సరకులు సరఫరా చేయాలని, నీటిలో మునిగినటువంటి రైతులకు నష్ట పరిహారం చెల్లించాలన్నారు. తహసీల్దార్ స్పందించి అందరికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో విజయ్, రమేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

## అల్పపీడన ప్రభావంతో లోతట్టు ప్రాంతాలు జలమయం

**నగరి, అక్టోబరు 16 ప్రభాతవార్త:**



బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రెండు రోజుల పాటు నియోజకవర్గ పరిధిలో ఎడ తెరపి లేని వర్షం కురుస్తోంది. ఎడ తెరపి లేని లో తట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పంట పొలాలు నీట మునిగింది. నగరి పేట ప్రాంతంలో నివాసాల్లోకి వర్షపునీరు ప్రవహించడంతో ఇబ్బందులు పడ్డారు. టీఆర్ కండ్రిగ ఇళ్ళ నివాస ప్రాంతాల్లో అంతర్గత రోడ్లు బురదమయమై అక్కడక్కడ గుంటల్లా వర్షపునీరు చేరింది. వరద నీటి కాలువలో మోస్తరు నీరు ప్రవహించింది. రోడ్లపై జన సంచారం తగ్గింది. నగరి మండలంలో 77.6 మి.మీ వర్షపాతం నమోదైందని అధికారులు తెలిపారు.

# భారీ వర్షం సూచన...ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**తీర ప్రాంత ప్రజలకు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశాం-ప్రాణ ఆస్తి నష్టాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాం- గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా**



గూడూరు, అక్టోబర్ 16, ప్రభాతవార్త : బంగాళా ఖాతంలో వాయుగుండంగా బలపడిన అల్పపీడనం తుఫానుగా మారి నెల్లూరు, పుదుచ్చేరి మధ్య తీరం దాటేందుకు అవకాశం ఉందని దీంతో గూడూరు డివిజన్‌లో భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా పేర్కొన్నారు. బుధవారం స్థానిక కబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ తుఫాను కారణంగా నేడు, రేపు భారీ వర్షాలు కురుస్తాయన్న సమాచారం ఉందని చెప్పారు. వాయుగుండం చెన్నైకి 440కి.మీ, పుదుచ్చేరికి 460 కి.మీ, నెల్లూరుకి 530 కిమీ దూరంలో ఉందని రాత్రి 11 గంటలు లేదా తెల్లవారుజామున 4 గంటల సమయంలో పుదుచ్చేరి నెల్లూరు మధ్య తీరం దాటి అవకాశం ఉందన్నారు. తుఫాను తీరం దాటే సమయంలో 40 కిలో మీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశాలున్నాయన్నారు. గూడూరు డివిజన్‌లోని తీరప్రాంత ప్రజలను ముందస్తుగా పునరావాస కేంద్రాల్లో తరలించేందుకు క్షేత్రస్థాయిలో అధికారు లు అన్ని ఏర్పాటు చేశారన్నారు. ప్రజలకు ఎలాంటి ప్రాణ ఆస్తి నష్టం జరగకుండా అన్నీ శాఖల అధికారులను ఆయా సచివాలయాల్లో ఏర్పాటు చేశామన్నారు. అత్యవసరమైతే తప్ప ప్రజల వారి ఇళ్ల నుంచి బయటకు రావద్దని సూచించారు. తీర ప్రాంత మండలాల్లో మత్స్యకారులను ఇప్పటికే చేపల వేటకు వెళ్లకుండా చర్యలు చేపట్టినట్లు వివరించారు. అత్యవసర సేవలకు అవసరమైతే ఆయా మండల కార్యాలయంలోని కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశామని, ఆ నెంబర్లకు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని వివరించారు. అధికారులు అందుబాటులో, 24 గంటలు అందుబాటులో ఉంటారన్నారు. డివిజన్ కేంద్రంలో 08624-252807, గూడూరు మండల కేంద్రంలో 701348 3056, వాకాడు 8142100 824, చిట్టమూరు 9989932809, బాలాయపల్లి 7036005230, వెంకటగిరి 862529 5044, డక్కిలి 799346307 ఫోన్ నెంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు.

# పిఎం ఎస్‌హెచ్‌ఆర్‌ఐ పాఠశాలలు అభివృద్ధికి చర్యలు : కలెక్టర్



చిత్తూరు, అక్టోబర్ 16 ప్రభాతవార్త: జిల్లాలో పిఎం ఎస్‌హెచ్‌ఆర్‌ఐ కింద ఎంపిక కాబడ్డ పాఠశాలలను అన్ని రకాల అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులు ఆదేశించారు. కలెక్టరేట్ నుండి బుధవారం పిఎం ఎస్‌హెచ్‌ఆర్‌ఐ పాఠశాలల కింద ఎంపిక కాబడ్డ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి సంబంధిత జిల్లా అధికారులు, ఎంఇఓలు, హెడ్మాస్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పిఎం ఎస్‌హెచ్‌ఆర్‌ఐ కింద 40 పాఠశాలలు ఎంపిక అయ్యాయని, ఇందులో మొదటి విడతలో 30, రెండవ విడతలో 10 పాఠశాలలు వున్నాయన్నారు. మొదటి విడతలో ఎంపికైన 30 పాఠశాలల్లో సివిల్ పనుల్లో భాగంగా ఆట స్థలాల అభివృద్ధి, మరొక అంశంగా లాబ్స్ అభివృద్ధి చేయాలన్నారు. సివిల్ పనులను నాణ్యతతో చేపట్టి పూర్తి చేయాలని, పూర్తయిన పనులకు సంబంధించిన బిల్లులను సత్వరం అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లోని ఆర్‌ఓ ప్లాంట్లను పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని, ఈ విషయంలో ఎపిఇడబ్ల్యుఐడిసి, ఎంఇఓలు, హెచ్‌ఎంలు సమన్వయంతో పని చేయాలన్నారు. అలాగే ఈ కార్యక్రమంలో భాగంగా సెట్విన్ వారు యూత్ క్లబ్‌లు ఏర్పాటు చేయాలని, ఎంపిక కాబడిన పాఠశాలల ఉపాధ్యాయులకు కార్వేటి నగరం డైట్ ద్వారా శిక్షణ ఇవ్వాలన్నారు. ఆర్‌ఓ ప్లాంట్ల మరమ్మత్తుకు సంబంధించి స్కూల్ మేనేజ్‌మెంట్ ఫండ్‌ను ఉపయోగించుకోవాలన్నారు. ప్రతి పాఠశాలకు 2023-24 ఆర్థిక సంవత్సరానికి విడుదలైన స్కూల్ నిర్వహణ నిధిను పాఠశాలల అభివృద్ధికి ఖర్చు చేయాలన్నారు. ఈ నిధులు సక్రమంగా ఖర్చు చేస్తే రానున్న సంవత్సరానికి పాఠశాలలకు నిధులు మంజూరు అవుతాయన్నారు. అలాగే ఉపాధి పథకం కింద పాఠశాలల ప్రహరీ గోడల నిర్మాణాలు చేపట్టే అవకాశం వుందని, ఏ పాఠశాలల్లో ప్రహరి గోడల నిర్మాణాలు చేపట్టాలనే విషయంపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎస్‌ఎస్‌ఏ పిఓను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఎస్‌ఎస్‌ఏ పిఓ వెంకటరమణారెడ్డి, చిత్తూరు డివైఇఓ చంద్రశేఖర్, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎంఇఓలు, హెడ్మాస్టర్లు పాల్గొన్నారు.

## పొన్నవోలులో టెంకాయ చెట్టుపై పిడుగు



చిల్లకూరు, అక్టోబర్ 16 ప్రభాతవార్త : మండల పరిధిలోని పొన్నవోలు గ్రామ పంచాయితీలో మంగళ వారం రాత్రి హరిజనవాడలోని పసలకోటయ్య ఇంటి వద్ద ఉన్న టెంకాయ చెట్టుపై పిడుగు పడింది. ఈ ప్రమాదంలో చెట్టు కొంతమేర కాలిపోవడం అటు ఇంట్లో టివి కాలిపోయి ఇంటి గోడ పగిలిపోయింది. అంతే తప్ప ఎలాంటి ప్రాణ నష్టం జరగలదని తెలుసుకున్న చిల్లకూరు తహశీల్దార్ శ్రీనివాస రావు సంఘటన స్థలానికి చేరుకుని జరిగిన ప్రమాదంకు గల కారణాలు తెలుసు కున్నారు. అదే విధంగా ఎంపిడివో గోపి, స్పెషల్ ఆఫీసర్లు అం దరూ లోతట్టు ప్రాంతాల్లో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేసి పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు. తహశీల్దార్ కార్యాల యం పక్కనే ఉన్న జగనన్న కాలనీలో వరద నీరు ఎక్కువ చేరడంతో తహశీల్దార్ ఆధ్వర్యంలో జేసిబి సహాయంతో వరద నీటిని పక్కకు తరలించారు.

## లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి : కమిషనర్



తిరుపతి కార్పొరేషన్, అక్టోబర్ 16 ప్రభాతవార్త : తుఫాన్‌తో కురుస్తున్న భారీ వర్షాలకు వరద నీరు రోడ్లపైకి, లోతట్టు ప్రాంతాల్లోకి వెళ్లి ఆగకుండా ప్రత్యేక మార్గాల్లో గుంటల్లోకి వెళ్లేలా అన్ని చర్యలు చేపట్టామని నగర పాలక సంస్థ కమిషనర్ ఎన్. మౌర్య తెలిపారు. బుధవారం తుఫాను ప్రభావంతో సోమవారం నుండి కురు స్తున్న వర్షాలతో నగరంలోని అన్ని డివిజన్‌లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులు, రోడ్లపైకి నీరు రాకుండా సహాయక చర్యలను అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతే నగరంలో లోతట్టు ప్రాంతాలైన కొరమేనుగుంట, ఆటో నగర్, తదితర ప్రాంతాల్లో వర్షపు నీరు వచ్చాయన్నారు. ఆ నీరు బయటకు వెళ్లేలా ప్రత్యామ్నాయంగా కాలువలు తీసి నీరు లోనికి రాకుండా చేస్తున్నామన్నారు. ఇక్కడి ప్రజలు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు చేపడుతున్నామని అన్నారు. కపిలతీర్థం, మాల్వాడి గుండం నుండి నీరు వస్తే నగరంలో నీరు ఆగే అవకాశం ఉందన్నారు. అయితే ప్రస్తుతం జేసిబిల ద్వారా అన్ని ప్రాంతాల్లో డ్రైనేజీ కాలువల్లో పూడికతీత పనులు చేశామని అందువల్ల నీరు నిలిచే అవకాశం లేదన్నారు. అలాగే విద్యుత్ శాఖ అధికారులను సమన్వయం చేసుకుంటూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగకుండా విద్యుత్ తీగలకు అడ్డంకిగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించే ప్రక్రియను చేస్తున్నామని అన్నారు. కొంత మందిని పునరావాస కేంద్రాలకు తరలించి వారికి అవసరమైన తాగునీరు, ఆహారం, విద్యుత్ సౌకర్యం, ఫ్యాన్లు, పారిశుద్ధ్యం తదితర సదుపాయాలు కల్పించామన్నారు. ఏమైనా సమస్యలు వస్తే హెల్ప్ లైన్ నంబర్ 08772256766ను సంప్రదిస్తే తమ సిబ్బంది సాయం అందిస్తారని తెలిపారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాం సుందర్, మున్సిపల్ ఇంజనీర్లు తులసి కుమార్, గోమతి, ఆఫీసర్ సేతుమాధవ్, ఇంజనీరింగ్, రెవెన్యూ, టౌన్ ప్లానింగ్, ఇరిగేషన్, పోలీసులు తదితర విభాగాల అధికారులు ఉన్నారు.

**ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఎమ్మెల్యే**

తుఫాన్ కారణంగా కురుస్తున్న భారీ వర్షాలకు ప్రజలు అవసరమైతే తప్ప ఇళ్ళు వదిలి బయటకు రాకుండా ఉండాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కోరారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను ఆదుకునేందుకు 17 పునరావాస కేంద్రాలను నగరంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నగరంలో ముఖ్య కూడళ్లలో నీళ్ళు నిల్వకుండా మున్సిపల్ అధికారులు, సిబ్బంది చూస్తున్నారని ఆయన చెప్పారు. తుఫాన్ తీరం చాటే ముందు, తరువాత భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున గురువారం మరింత, అప్రమత్తంగా ప్రజలు ఉండాలని ఆయన కోరారు. ఇటీవల డ్రైనేజీ కాలువల్లో పూడిక తీయడం వల్ల నీళ్ళు నిలిచే అవకాశం తక్కువగా ఉన్నట్లు ఆయన తెలిపారు. మున్సిపల్ సిబ్బందితో పాటు విద్యుత్ శాఖ, రెవెన్యూ, పోలీసులు సమన్వయంతో 24 గంటలు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకున్నట్లు ఆయన చెప్పారు. లోతట్టు ప్రాంతాల ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు.

## ట్రాఫిక్ నియమాలు పాటించకుంటే కఠిన చర్యలు

**ట్రాఫిక్ డిఎస్పి రామకృష్ణచారి**



తిరుపతి కార్పొరేషన్, అక్టోబర్ 16 ప్రభాతవార్త : ట్రాఫిక్ నియమ నిబంధనలను తప్పకుండా పాటించాలని, అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ట్రాఫిక్ డిఎస్పి రామకృష్ణచారి తెలిపారు. బుధవారం పట్టణ పరిధిలో ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తూ వాహనాలు నడిపిన డ్రైవర్లపై ట్రాఫిక్ పోలీసు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులను నమోదు చేసి 25 మంది ముద్దాయిలను 4వ అడిషనల్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కోర్టు నందు హాజరు పరచగా జడ్జి గ్రంధి శ్రీనివాస్ ఒక్కొక్కరికి 10 వేల రూపాయిలు చొప్పున మొత్తం 25 మందికి 2.50 లక్ష జరిమానా విధించారు. అధిక మోతాదులో మద్యం సేవించిన ఒకరికి తిరుచానూరు యోగిమల్ల వరంకు చెందిన జయరామయ్య కుమారుడు సురేష్ (45)కు రెండు రోజులు జైలు శిక్ష విధించారు. తిరుపతి ట్రాఫిక్ పోలీసుల పనితీరును జిల్లా ఎస్పి ఎల్. సుబ్బరాయుడు అభినందించారు. తిరుపతి నగర ప్రజలకు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా బాధ్యతతో విదులు నిర్వర్తించాలని సూచించారు.

## జాతీయ సఫాయి కరంచారి కమిషనర్ చైర్మన్ రాక

**-జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్**

తిరుపతి కార్పొరేషన్, అక్టోబర్ 16 ప్రభాతవార్త : జాతీయ సిఫాయి కరంచారి కమిషన్, న్యూఢిల్లీ చైర్మన్ ఎం. వెంకటేశన్ ఈ నెల 18 నుండి 20వ తేది వరకు తిరుపతి, చిత్తూరు జిల్లాలో ది ప్రొహిబిషన్ ఆఫ్ ఎంప్లాయ్‌మెంట్ యాజ్ మాన్యువల్ స్కావెంజర్ అండర్ రీహాబిలిటేషన్ యాక్ట్ 2013 అమలును సమీక్షించడానికి జిల్లాకు రానున్నారని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ బుధవారం తెలిపారు. జాతీయ సఫాయి కరంచారి వారి కమిషన్ చైర్మన్ 18వ తేది మధ్యాహ్నం 12.30 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకుని అక్కడ నుండి చిత్తూరు జిల్లాకు రోడ్డు మార్గాన చేరుకుని పలు కార్యక్రమాలలో పాల్గొని తిరిగి రాత్రి 8 గంటలకు తిరుపతికి విచ్చేసి రాత్రి బస చేస్తారని తెలిపారు. 19వ తేది ఉదయం తిరుమల శ్రీ వారిని విఐపి బ్రేక్ దర్శనం చేసుకుని మధ్యాహ్నం 12 గంటలకు తిరుపతి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ వైస్ చైర్మన్, సెక్రటరీతో పాటు సంబంధిత సఫాయి కరంచారి నాయకులు, పారిశుద్ధ్య కార్మికులతో సమావేశం తుడా మీటింగ్ హాల్‌లో నిర్వహిస్తారని తెలిపారు. అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు డీన్, మెడికల్ సూపరింటెండెంట్, శ్రీ వెంకటేశ్వర రాం నారాయణ్ రుయా ప్రభుత్వ జనరల్ హాస్పిటల్, ఇతర సీనియర్ అధికారులతో పాటు సఫాయి కరంచారిల నాయకులు, పారిశుద్ధ్య కార్మికులతో సమావేశం రుయా ఆసుపత్రి మీటింగ్ హాల్‌లో నిర్వహిస్తారని, సాయంత్రం ఐదు గంటలకు శ్రీ వెంకటేశ్వర ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్, హాస్పిటల్ డైరెక్టర్ కమ్ - వైస్ చాన్సలర్, మెడికల్ సూపరింటెండెంట్, ఇతర సీనియర్ అధికారులతో పాటు సంబంధిత అధికారులు, సఫాయి కరంచారిల నాయకులతో సమావేశం స్విమ్స్ మీటింగ్ హాల్‌లో నిర్వహిస్తారని, అనంతరం అదే రోజు రాత్రి తిరుపతి నందు బస చేస్తారని, మరుసటి దినం అనగా 20వ తేదిన ఉదయం 9.10 గంటలకు రేణిగుంట విమానాశ్రయం నుండి వారు డిల్లీకి తిరుగు ప్రయాణం కానున్నారని కలెక్టర్ తెలిపారు.

## వర్షం కారణంగా ఆలయంలోనే ఊంజల్‌సేవ



శ్రీకాళహస్తి, అక్టోబర్ 16 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం పౌర్ణమి సందర్భంగా ఊంజల్‌సేవను నిర్వహించాల్సి ఉండగా భారీ వర్షాలకారణంగా ఆలయంలోని అలంకార మండపంలోనే స్వామిఅమ్మవార్లను చక్కగా ముస్తాబుచేసి విశేషహారతులిచ్చారు. అనంతరం ఆలయంలోనే స్వామిఅమ్మవార్లను గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఎఈఓ లోకేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ హరియాదవ్, ఆలయాధికారులు పాల్గొన్నారు.

## పొంగి ప్రవహించిన కైవల్యా నది



వెంకటగిరి, అక్టోబర్ 16 ప్రభాతవార్త : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా వెంకటగిరి ప్రాంతంలో భారీ వర్షం పడింది. పట్టణంలోని వీధులన్నీ జలయమయ్యాయి. సవారి గుంటలో నివాసం ఉంటున్న వారి ఇళ్లలోకి నీళ్లు చేరడంతో స్థానికులు ఇబ్బంది పడ్డారు. గత మూడు రోజుల నుండి ఎడతెరపి లేకుండా వర్షం పడుతుం డడంతో ప్రజా జీవనం స్తంభించింది. అధికారులు ముందు జాగ్రత్తగా మల్లమ్మ గుడి వద్ద కైవల్య నది ఒడ్డు ప్రాంతంలో నివసిస్తున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. కైవల్యా నది తుఫాను కారణంగా కురిసిన వర్షానికి పొంగి ప్రవహిస్తోంది. వెలుగొండ అడవుల్లో భారీగా వర్షం పడడంతో కైవల్య నదికి పడవ వచ్చింది. మల్లమ్మ గుడి వీధి వద్ద కైవల్య నది కాజ్‌వే పై పొంగి ప్రవహించింది. స్థానికులు నది వరద వీక్షిస్తున్నారు.

## సూళ్లూరుపేటలో భారీ వర్షం



సూళ్లూరుపేట, అక్టోబర్ 16 ప్రభాతవార్త : సూళ్లూరుపేట మండలంలో తుపాను ప్రభావంతో గత రెండురోజులుగా పడుతున్న వర్షం ఎడతెరిపి లేకుండా కురుస్తూనే ఉంది. బుధవారం మధ్యాహ్నం వరకు భారీ వర్షం కురిసి కొంత తెరపినిచ్చింది. భారీ వర్షాల నేపథ్యంలో పంట పొలాల్లోకి నీరు చేరింది. ప్రస్తుతం కురిసిన వర్షం ఎలిది పైర్లకు మేలు చేస్తుండగా, ఇప్పుడే నార్లు పోసిన వారు బాగా నష్టపోయారు. పడమటికండ్రిగతో పాటు లోతట్టు ప్రాంతాల పంట పొలాల్లోకి వర్షపు నీరు భారీగా చేరింది. మన్నారుపోలూరు సమీపంలోని జగనన్న కాలనీలోకి వర్షపు నీరు అధికంగా చేరడంతో కాలనీలోకి వెళ్లేందుకు మార్గం లేకుండాపోయింది. పట్టణంలోని లోతట్టు ప్రాంతాలైన సాయినగర్, గమండ్ల వీధి, సూళ్లూరు, నాగరాజపురం, బాపూజీ కాలనీ ప్రాంతాల్లో వర్షపు నీరు ఇళ్లలోకి ప్రవేశించడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. పట్టణంలోకి ప్రవేశించే జిఎన్‌టి రోడ్డుపైకి వర్షపునీరు చేరడంతో మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య ఆధ్వర్యంలో నీటిని కచ్చా కాలువల ద్వారా పక్కకు పంపే ప్రయత్నాలు ముమ్మరంగా చేపట్టారు. దీంతో కొంత వరకు ప్రజలకు ఉపశమనం లభించింది. మిగతా ప్రాంతాల్లో రోడ్డుపైకి వర్షపు నీరు చేరుకున్నాయి. అసలే గుంటలమయంగా ఉన్న రోడ్డుపై నీరు చేరడంతో ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

## యాదమరి ఎంపిపి సురేష్‌బాబు అరెస్టు

చిత్తూరు, అక్టోబర్ 16 ప్రభాతవార్త: 2024 సార్వత్రిక ఎన్నికల సమయంలో అక్రమంగా టపాకాయలను నిల్వ వుంచరనే నమోదైన కేసులో చిత్తూరు టుటౌన్ పోలీసులు యాదమరి ఎంపిపి సురేష్‌బాబుతో పాటు నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. టుటౌన్ ఇన్స్‌పెక్టర్ నెట్టికంఠయ్య వెల్లడించిన వివరాల మేరకు 2024 సార్వత్రిక ఎన్నికల సమయంలో యాదమరి ఎంపిపి సురేష్‌బాబుతో పాటు గాయత్రి నగర్‌కు చెందిన శివకుమార్, యాదమరి మండలం మాధవరం హరిజనవాడకు చెందిన కె.రమేష్ అలియాస్ చిలక, మురళీ, చిన్నాలు ఎన్నికల ప్రచార సమయంలో టపాకాయలు పేల్చారు. ఈ క్రమంలో ట్రాన్స్‌కో కార్యాలయంలోని ఎలక్ట్రిక్ స్టోర్స్‌పై ఈ టపాకాయలు పడటంతో గిరింపేటలో వున్న స్టోర్స్‌లో వున్న 14.98 లక్షల రూపాయల విలువైన సామాగ్రి ధ్వంసం అయ్యింది. ఈ మేరకు అప్పటి ట్రాన్స్‌కో డిఇ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయడం జరిగిందని, ఈ కేసుకు సంబంధించి నిందితులను ప్రస్తుతం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్స్‌పెక్టర్ నెట్టికంఠయ్య తెలిపారు.

## త్వరలో ప్రజలకు అందుబాటులో ఎన్టీఆర్ సుజల ప్లాంట్లు

**- కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్**



కుప్పం, అక్టోబర్ 16 ప్రభాతవార్త : కుప్పం నియోజకవర్గ ప్రజలకు పూర్తిస్థాయిలో అతిత్వరలో ఎన్టీఆర్ సుజల ప్లాంట్ల ద్వారా శుద్ధనీరు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. బుధవారం గుడుపల్లెలోని శ్రీ రాళ్లగంగమ్మ ఆలయం వద్ద గల ఆర్వో ప్లాంట్, బస్టాండు వద్ద గల రిమోట్ డిస్పెన్సింగ్ యూనిట్‌ను ఆయన పరిశీలించారు. మదర్ ప్లాంట్ల ద్వారా గ్రామాల్లో ఏర్పాటుచేసిన ట్యాంకులను నీరు అందిస్తామన్నారు. డిఇ పురుషోత్తం మాట్లాడుతూ సుజల ప్లాంట్ల పునరుద్ధరణకు పది కోట్లతో ప్రతిపాదనలు రూపొందించినట్లు తెలిపారు. నిధులు మంజూరు కాగానే పనులు వేగవంతం చేస్తామన్నారు. అనంతరం ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ కుప్పం ఏరియా ఆస్పత్రిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆస్పత్రిలో రోగులకు అందుతున్న సేవల గురించి ఆరా తీశారు. పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఎంఎస్ డా॥ విజయ కుమారిని ఆదేశించారు. ఆస్పత్రిలో రోగులకు ఇస్తున్న బెడ్‌షీట్లపై అస ంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మార్చురీ గది ప్రాంతాన్ని పరిశీలించారు. గది శిథిలదశరకు చేరిందని కొత్త గది నిర్మాణం ఇతర అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బి డిఇ దస్తగిరి పాల్గొన్నారు.

## విజయపురంలో కుంభవృష్టి



విజయపురం, అక్టోబరు 16 ప్రభాతవార్త: మండలంలో ఎడ తెరపి లేని వర్షం కురవడంతో బుధ వారం జన జీవనం పూర్తిగా స్తంభించింది. మండలంలో 50 శాతంపైగా చెరువుల్లో జలకళ సంతరించుకుంది. మండలంలోని పాతార్కాడు, ఇళ్ళత్తూరు పెద్ద చెరువు, మహావీరాపురం చెరువులు మొరవులు పారుతున్నాయి. మండల పరిధిలో పలు ప్రాంతాల్లో వరిపంట పొలాలు నీట మునిగి అపార నష్టం వాటిల్లింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. చిత్తూరు-తచ్చూరు హైవే రోడ్డు పనులు చేపట్టడం వల్ల వర్షపునీరు వెళ్లేదారి లేక కలియంబాకం వద్ద పంట పొలాలు చెరువును తలపిస్తున్నాయి. పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు రైతులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి విజయపురం ఎంపీడీవో కార్యాలయ భవనం ఉరుస్తోంది.

## వరద ప్రభావిత ప్రాంతాలలో పర్యటించిన జిల్లా ఎస్పీ

**-లోతట్టు ప్రాంతాలలో సహాయ చర్యలకు పోలీసులను అప్రమత్తం**



తిరుపతిరూరల్, అక్టోబర్16 ప్రభాతవార్త: బంగాళా ఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో గత రెండురోజులుగా తిరుపతి జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్న విషయం తెల్సిందే. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నదులు, వాగులు, వంకలు పొంగిపొర్లి ప్రవహించే అవకాశం ఉన్నందున ముందస్తుగా తిరుచానూరు పోలీసు స్టేషన్ పరిధిలో వివి నగర్ ప్రాంతాన్ని బుధవారం జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు పర్యటించారు. పోలీసులు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. వాతావరణ సమాచారం మేరకు తుఫాన్ వల్ల ప్రజలు ఇబ్బందులు పడకుండా పోలీసులు ఇతర శాఖలను సమన్వయం చేసుకుని సహాయ చర్యలను చేపట్టాలని ఎస్పీ సూచించారు. వరద ముంపు వల్ల లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించుటలో పోలీసులు సహాయం అందించాలన్నారు. తుఫాన్ కారణంగా ఈదురు గాలులతో కూడిన వర్షం కురవడంతో అక్కడక్కడ వృక్షాలు రహదారులపై నేరకొరిగాయని, పోలీసులు అప్రమత్తమై చెట్లను తొలగించి, ప్రజా రవాణాకు ఆటంకం కలగకుండా చూడాలన్నారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని సూచించారు. నిస్సాయులైన వృద్ధులు, చిన్న పిల్లలకు స్థానిక యువత సాయం అందించాలని సూచించారు. వర్షాల వల్ల విపత్కర పరిస్థితులు తలెత్తితే ప్రజలు 122/8099999977 నెంబర్లను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు చంద్రగిరి డియస్పీ ప్రసాద్, తిరుచానూరు సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్పస్వామి నూతన ఆలయ విగ్రహ ప్రతిష్ట

**మహా కుంభాభిషేకంలో మాజీ మంత్రి రోజా**



నగరి, అక్టోబరు 16 ప్రభాతవార్త: నగరి రూరల్ దేశూరు అగరం గ్రామంలో శ్రీశ్రీ ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి వారి నూతన ఆలయ అష్టబంధన విగ్రహ ప్రతిష్ట మహా కుంభాభిషేక మహోత్సవంలో మాజీ మంత్రి రోజా బుధవారం పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు వేద పండితులు మాజీ మంత్రి రోజాకి గన స్వాగతం పలికారు. అయ్యప్ప స్వామివారికి విశేషంగా జరిగిన మహా కుంభాభిషేక మహోత్సవంలో భాగంగా నంది వాహనంపై ఊరేగిన స్వామివారి ఆలయ ప్రదక్షిణలో పాల్గొన్నారు. మహా కుంభాభిషేకంలో బుధవారంస్వామివారికి ప్రత్యేక కలశ అభిషేకం, ప్రత్యేక అలంకరణ నిర్వహించారు. కార్యక్రమంలో నగరి రూరల్ మండల వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## కనువిందు చేస్తున్న యోగులపర్వతం



రామచంద్రాపురం, అక్టోబర్ 16 ప్రభాత వార్త: గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు బుధవారం కమ్మపల్లి సమీపంలోని యోగుల పర్వతం చూపరులను కనువిందు చేసింది. పర్వతంపై మేఘావృతం కావడం, కొండపై నుండి జాలువారే నీరు ఎంతో ఆహ్లాకరంగా మారింది. కొండ పరిసర ప్రాంతాల గ్రామస్థులు యోగుల పర్వతం అందాలను వీక్షించి అబ్బురపడుతున్నారు.

## జలమయమైన కాటేజీ ప్రాంతాలు



తిరుమల, అక్టోబర్ 16 ప్రభాతవార్తప్రతినిధి: బంగాళా ఖాతంలో అల్పపీడనం ప్రభావంతో బుధవారం ఉదయం నుండి తిరుమలలో జోరువర్షం కురుస్తోంది. గత మూడురోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు తిరుమలలో చల్లటిగాలులు వీస్తున్నాయి. జోరు వానకు భక్తులు ఎక్కడికక్కడే ఆగిపోయారు. కురిసిన భారీ వర్షానికి ఆలయం ప్రాంతం, పరిసరాలు జలమయంగా మారాయి. వర్షం కురుస్తుండటంతో తిరుమల కొండలను పొగమంచు కప్పేసింది. ఉదయం నుండి పూర్తిగా మంచుతో తిరుమలను కప్పేయ డంతో వాహనాలు, భక్తులు దగ్గరగా వస్తేగానీ కనిపించేపరిస్థితి లేదు. చలివిపరీతంగా వుంది. భక్తులు వానలో తడుస్తూనే గదులకు చేరుకోవాల్సి వచ్చింది. చిన్నపిల్లలు, వృద్ధులు గదుల నుండి బయటకు రావాలంటే ఇబ్బందులు పడుతున్నారు.

## రూపు మారనున్న పాకాల రైల్వే




పాకాల, అక్టోబర్ 16, ప్రభాతవార్త : పాకాల రైల్వే జంక్షన్ మీదుగా తిరుపతి నుంచి కాట్పాడి వరకు నూతన రైల్వే లైన్ ఏర్పాటు చేయమని వార్త పత్రికలో వచ్చిన కథనం తెలిసిందే. ఈ మేరకు అక్టోబర్ 3వ తేదిన జరిగిన రైల్వే బోర్డ్ మీటింగ్‌లో చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమల్ల ప్రసాద రావు తిరుపతి నుంచి పాకాల మీదుగా కాట్పాడి వరకు రెండవ లైన్ నిర్మాణం చేయమని కోరగా స్పందించిన రైల్వే అధికారులు భూ సేకరణ పనులు చేయనున్నట్లు పార్లమెంట్ సభ్యులకి తెలియజేశారు. నూతన రైలు మార్గం కొరకు దాదాపు 35 ఎకరాల భూమి అవసరమని రైల్వే ఉన్నతాధికారులు, తిరుపతి జిల్లా కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్ దృష్టికి తీసుకొని రాగా స్పందించిన వారు రైల్వే వారికి కావాల్సిన భూ సేకరణ మొదలు పెట్టవల్సిందిగా తమ సిబ్బందికి ఆదేశాలు ఇస్తున్నట్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. త్వరలో పాకాల రైల్వే జంక్షన్ నందు నూతన టర్మినల్ యాడ్ పనులు మొదలుకానున్న తరుణంలో రైల్వే అధికారుల నుంచి నూతన రైలు మార్గం భూ సేకరణ చేయటం మంచి పరిణామమని ఈ దిశగా అడుగులు వేయడం హర్షనీయమని స్థానిక ప్రజలు ప్రెసిడెంట్ మచ్చ దొరస్వామి నాయుడు, నారా సుబ్రమణ్యం నాయుడు అంటున్నారు.

# కేవీబీ పురంలో పర్యటించిన ఆర్డీవో



కేవీబీ పురం, అక్టోబరు 16 ప్రభాతవార్త: తుఫాను ప్రభావంతో బుధవారం కేవీబీ పురం మండలంలో ముంపుకు గురైన కాజ్‌వేలను శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, ఇన్‌చార్జి తహసీల్దార్ మునిరత్నంతో కలసి పర్యవేక్షించారు. తుఫాను ప్రభావంతో గ్రామాల్లో ప్రజలకు ఎలాంటి ప్రమాదాలకు గురికాకుండా లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని, ప్రతి వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి గ్రామాల్లో హెడ్ క్వార్టర్‌లోనే ఆ పంచాయతీల్లో ఉండి ఇబ్బందులను ఎప్పటికప్పుడు కంట్రోల్ పాయింట్‌కి తెలియ జేయాలన్నారు. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశాల మేరకు అధికారులు కేవీబీ పురం మండలంలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. రాజులకండ్రిగ వద్ద కాజ్‌వే పొర్లుతుందని, కోవనూరు వద్ద కాలువ ప్రవాహం ఉధృతమైందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వీఆర్వోలు అక్కడ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు పడకుండా వేచి ఉండాలని ఆయన తెలిపారు. కాలంగి గేట్లు వద్ద ప్రవాహం 0.7 క్యూసెక్కుల నీరు అధికమవు తుందన్న ఉద్దేశంతో ఒకప్రధాన గేటును మాన్యువల్ ద్వారా కొంత తీయడం జరిగిందన్నారు. తహసీల్దార్ మునిరత్నం మాట్లాడుతూ మండలంలో ఉదయం 8 గంటలకు వరకు 98.6 మి.మీ వర్షపాతం నమోదైందని ఆయా పంచాయతీల్లో వీఆర్వోలను అక్కడే ఉండి నిద్ర చేసి ప్రజలకు చర్యలు చేపట్టాలని ఆయన తెలిపారు. ఆర్డీవో వెంట వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఇరిగేషన్ ఏఈ బాబులు ఉన్నారు.

**డ్వామా పీడీ పర్యటన:**

తీవ్ర తుఫాను ముంచుకొస్తున్న సందర్భంగా కేవీబీ పురం మండలంలోని కోవనూరు, పూడి, కాలంగి రిజర్వాయర్‌లను డ్వామా పీడీ సి.వి.శ్రీనివాస ప్రసాద్ బుధవారం సుడిగాలి పర్యటన చేశారు. ఆయన మాట్లాడుతూ ఎలాంటి ప్రాణనష్టం, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తుఫాను ముప్పు ఉన్నందు వలన ప్రజలకు ఎలాంటి నష్టం జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని, ప్రజలు కచ్చితంగా ఆరోగ్య జాగ్రత్తలు ప్రయాణ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వాగులు, వంకలు, చెరువులు ప్రమాదకర నీటి గుంటల వద్దకు వెళ్ళరాదని అత్యవసర పరిస్థితులు ఏర్పడితే పోలీసు శాఖకు కచ్చితంగా సమాచారం ఇవ్వాలని, ప్రధాన రహదారుల సమీపంలో వంతెనలు దాటే సమయంలో జాగ్రత్తలు వహించాలని, అధికార యంత్రాంగం అలర్ట్‌గా ఉండాలని ప్రజలు ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ మునిరత్నం, ఎంపీడీవో రాధారాణి, ఎస్ఐ వీరాంజనేయులు, అధికారుల బృందం తదితరులు పాల్గొన్నారు.